# విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

ఆదివారం 11 ఆగస్టు 2024 8 పేజీలు


# అందుబాటులో ఇసుక

- చివరి వినియోగదారుని వరకూ ఇసుక అందుబాటులో ప్రభుత్వ లక్ష్యం
- ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్‌లు సహకారం అందించాలి
- వినియోగదారుడు రవాణా ఖర్చులు మాత్రమే చెల్లించాలి
- మైన్స్ శాఖలో పూర్తి స్థాయిలో ప్రక్షాళన
- మంత్రులు కొల్లు రవీంద్ర, కందుల దుర్గేష్

విశాలాంధ్ర- రాజమహేంద్రవరం రూరల్ :రాష్ట్ర ప్రభుత్వం ఒక మంచి ఆశయంతో ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తున్న దృష్ట్యా వాటిని ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకుని వెళ్ళే బాధ్యత అధికారులపై ఉందని రాష్ట్ర ఎక్సైజ్, మైన్స్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇసుక సరఫరా విధానం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్రతో పాటు మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పి డి. నరసింహ కిశోర్, ఎమ్మెల్యే లు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామ కృష్ణ , ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు), ఇన్‌చార్జి జెసి జి. నరసింహులు, మైన్స్ ఏ డి ఎమ్. సుబ్రహ్మణ్యం, ఇరిగేషన్ సిఈ పుల్లా రావు, ఎస్ఈ ఎస్. శ్రీనివాసరావు, డి ఎల్ ఎస్ ఏ సభ్యులు, లారీ అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 47 లక్షల మెట్రిక్ టన్నుల స్టాక్ పాయింట్ వద్ద, 71 లక్షల మెట్రిక్ టన్నుల డి సిల్టేషన్ పాయింట్ ఉచిత ఇసుక అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక పాలసీపై కొంత ప్రజల్లో అపోహలు ఉన్నాయని,వాటిని పరిష్కారం చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న ధరలకు అనుగుణంగా వినియోగ దారులకు ఇసుక అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. సచివాలయం ద్వారా వినియోగ దారులు ఇసుకను బుక్ చేసుకుని తీసుకుని వెళ్ళే క్రమంలో

▶మిగతా 2లో..

# పెండింగ్ జీతాలు విడుదల చేయాలి

## ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు వెల్లడి

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం :తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి ,మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్ కు మూడు నెలలుగా జీతాలు లేవని వెంటనే జీతాలు మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వ ఆసుపత్రి గేటు వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పెండింగ్ జీతాలు మంజూరు చేయాలని ,పిఎఫ్ అకౌంట్ ఇవ్వాలని పెరుగుతున్న ధరలకు అనుకూలంగా జీతాలు పెంచాలని తదితర నినాదాలు చేశారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు మాట్లాడుతూ ఈరోజుల్లో ఒక్కరోజు అద్దె పెండింగ్లో ఉన్నా ఇల్లు ఖాళీ చేయమంటున్నారని, చాలీచాలని జీతాలతో బతుకు నడవడం చాలా కష్టంగా ఉందని ఇటువంటి తరుణంలో మూడు నెలలుగా జీతాలు మంజూరు చేయకపోతే ఎలా బతకాలని మధు ఆవేదన వ్యక్తం

▶మిగతా 2లో..

# జీవితమంతా పార్టీ సేవలోనే...

## బత్తుల వెంకటేశ్వరరావు సంతాప సభలో దేగా ప్రభాకర్

విశాలాంధ్ర-ఏలూరు: బత్తుల వెంకటేశ్వరరావు మృతి సీపీఐకి తీరని లోటని, ఆయన జీవితమంతా పార్టీ సేవలోనే గడిచిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల వెంకటేశ్వరరావు సంతాప సభ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సభలో పాల్గొన్న దేగా ప్రభాకర్ మాట్లాడుతూ బత్తుల వెంకటేశ్వరరావు యువజన సమాఖ్యలో చురుకుగా పాల్గొని, మూడు దశాబ్దాలుగా కమ్యూనిస్టు పార్టీ ఉద్యమంలో ఎర్ర జెండా చేతబూని అనేక పోరాటాలు చేసి, అంచెలంచెలుగా నూజివీడు నియోజకవర్గ కార్యదర్శిగా, ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యునిగా ఎదిగారని

▶మిగతా 2లో

కాంట్రాక్టు కార్మికుల వేతనాలు

# తక్షణమే జమ చేయాలి

విశాలాంధ్ర-తణుకు: ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల మూడు నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు కోనాల భీమారావు కోరారు. శనివారం తణుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.అరుణకు యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా భీమారావు మాట్లాడుతూ మూడు నెలలు వేతన బకాయిలతో పాటు ఈఏడాది జనవరి నుంచి పి.ఎఫ్ సొమ్ము కార్మికుల ఖాతాల్లో జమ చేయవలసి వుందన్నారు.తక్షణమే వేతన బకాయిలు, పి.ఎఫ్ సొమ్ము జమ చేయాలని భీమారావు డిమాండ్ చేశారు. తణుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి స్థాయి కనుగుణంగా పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు ఎన్.చింతాలు, డి.చిన్నా, డి.లక్ష్మణరావు, ఎం.బేబి, ఎం.వెంకటలక్ష్మి, ఎన్.లక్ష్మి, డి.ప్రసన్నకుమారి, ఇ.హైమావతి, యు.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సహజ వనరుల సద్వినియోగంపై దృష్టి

## కలెక్టర్ షాన్ మోహన్ సగిలి

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా భౌగోళిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో లభ్యమవుతున్న సహజ వనరులను సద్వినియోగం చేసుకుంటూ స్వయం సహాయక సంఘాలు వినూత్న ఆలోచనలతో నూతన వ్యాపార అంశాలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అన్నారు. కాకినాడ జీజీహెచ్‌కు ఎదురుగా ఉన్న ప్రగతి భవన్‌ను ఆధునీకరణ పనులు పూర్తి కావడంతో పాటు నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా సమాఖ్య సమావేశ మందిరాన్ని శనివారం జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కే శ్రీరమణి, జిల్లా సమాఖ్య ప్రెసిడెంట్ ఐ. కాంచనతో కలిసి రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ

▶మిగతా 2లో

## రిజర్వాయర్ వద్ద జాగ్రత్తలు

**విశాలాంధ్ర-లింగపాలెం:** తమ్మిలేరు రిజర్వాయర్‌లోకి పైనుంచి 13 వందల క్యూసెక్కుల నీరు వస్తుందని ఇరిగేషన్ శాఖ ఏఈ పరమానంద్ తెలిపారు. రిజర్వాయర్లో 347 అడుగుల నీరు నిల్వ ఉందని రిజర్వాయర్ లోకి వచ్చే నీటిని బట్టి కిందకు



వదులుతున్నట్లు ఈయన వివరించారు. శనివారం 500 క్యూసెక్కుల నీటిని కిందకు వదిలామని తెలిపారు. బేతిపల్లి చెరువు నీరు కంటే వర్షం నీరు చెరువులకు పడిన అలుగు నీరు రిజర్వాయర్‌లోకి చేరుతుందని వచ్చే నీటి సామర్థ్యాన్ని బట్టి జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. రిజర్వాయర్ పరిధిలో ఉన్న ఎడమ, కుడి, మంకోల కాలువల ద్వారా ఆయకట్టుకు నీరువెళ్తున్నాయని పేర్కొన్నారు.రిజర్వాయర్ సామర్థ్యాన్ని బట్టి వచ్చే నీటిని పరిగణలోకి తీసుకొని తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు. వర్షాలు పడుతున్నందువల్ల రిజర్వాయర్కు ప్రమాదం లేకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తున్నట్లు తెలిపారు.

## తక్షణమే రహదారులపై గోతులు పూడ్చండి

**విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం:** తాడేపల్లిగూడెం నుండి తణుకు రహదారిలో తీవ్ర వర్షాలతో గోతులమయమైన రోడ్లను వెంటనే మరమ్మతులు చేయాలని శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అధికారులను

ఆదేశించారు. తాడేపల్లిగూడెం ఓవర్ బ్రిడ్జి నుంచి ప్రత్తిపాడు వరకు వర్షాల కారణంగా అధ్వానంగా మారిన రహదారులను ఆయన శనివారం పరిశీలించారు. ఆయన వెంట ఆర్ అండ్ బి అధికారులతో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు. ఇప్పటికే ఈ రోడ్లు టెండర్లు దశకు చేరుకున్న వర్షా బావ పరిస్థితులు నేపథ్యంలో నిర్మాణం జరగలేదని అతి త్వరలోనే ఈ రోడ్డును శాశ్వతంగా ఏర్పాటుచేందుకు కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం ప్రజలకు ఇబ్బందులు కలగకుండా గుంతలను పూడ్చాలని అధికారులకు ఆయన ఆదేశించారు. గుంతల కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగి గాయాలు పాలవుతున్న నేపథ్యంలో వెనువెంటనే రోడ్లకు మరమ్మత్తులు చేయాల్సిందిగా ఆయన ఆదేశించారు. ఈ క్రమంలో తాడేపల్లిగూడెం నుండి జువ్వలపాలెం ప్రత్తిపాడు అలంపురం వరకు ఆయన రోడ్లను పరిశీలించారు.

## చింతలపూడి- టి నరసాపురం ప్రధాన రోడ్డు అభివృద్ధి చేయాలి

**విశాలాంధ్ర-టి నరసాపురం:** ప్రమాద భరితంగా తయారైన చింతలపూడి - టి నరసాపురం ప్రధాన రహదారి

అభివృద్ధి చేయాలని మండల పరిధిలోని రోడ్లు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నరసాపురం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త యస్ డి నాసర్ పాషా, జనసేన పార్టీ నాయకులు పాలేటి సత్తిబాబు శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ పి .ధాత్రిరెడ్డిని ఏలూరు కలెక్టర్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేసినట్లు విలేఖరులకు తెలిపారు. ముందుగా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జెసికి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు జిల్లా మండల కేంద్రమైన టి.నర్సాపురం నుండి చింతలపూడి వరకు ప్రధాన రహదారి వాహనదారుల పాలిట ప్రమాద భరితంగా తయారైందన్నారు. రోడ్డు బాగా గుంతలు ఏర్పడడంతో 25 కిలోమీటర్లకు పైగా దూరమైన తెల్లం, ప్రగడవరం మీదుగా చింతలపూడి వెళ్ళాల్సి వస్తోందని దీంతో దూరం,భారం రెండు పెరిగాయన్నారు. చింతలపూడి - టి. నర్సాపురం రోడ్డుతో పాటు మండలంలోని గండిగూడెం, మక్కినవారిగూడెం - జీలుగుమిల్లి, బందివారి గూడెం, ప్రధాన రోడ్లు వెంటనే మరమ్మతులు చేయాలని, మండల పరిధిలోని అంతర్గత రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని టీ నర్సాపురంలో మిగిలి ఉన్న డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని గండిగూడెంలో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, పర్యావరణ కాలుష్యం తో పాటు ప్రయాణికులకు ఇబ్బందికరంగా తయారైన చింతలపూడి, టి నర్సాపురం రహదారిలోని గుర్రాజు గుంట వద్ద చింతలపూడి పంచాయతీ చెత్త డంపింగ్ నిలిపివేయాలన్నారు. రేబిస్, పాము కాటు వ్యాక్సిన్, అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామాలలో విష జ్వరాలు ప్రబలకుండా వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రజలలో అవగాహన కల్పించాలని కోరారు. వీరి వెంట సామాజిక కార్యకర్త జమీల బేగం ఉన్నారు.

## పార్టీ సేవలోనే

(1వ పేజీ తరువాయి)

కొనియాడారు. నూజివీడు ప్రాంతంలో పార్టీ అభివృద్ధికై నిరంతరం పాటుపడుతూ, సీనియర్ నాయకులు దాసరి నాగభూషణ రావు, చలసాని జగన్నాధరావు, కొమ్మన నాగేశ్వరరావులతో కలిసి అనేక భూ పోరాటాలు నిర్వహించి 25 వేల ఎకరాల భూమిని పేదలకు దక్కించడంలో బత్తుల వెంకటేశ్వరరావు కృషి చేశారని గుర్తు చేశారు. ఇటువంటి నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోవడం కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ బత్తుల వెంకటేశ్వరరావు నాలుగు సంవత్సరాల పాటు జైలు జీవితం గడిపినప్పటికీ మొక్కవోని దీక్షతో పార్టీ కార్యక్రమాలు అమలు జరిపారని తెలిపారు. ఇటువంటి నాయకులను స్మరించుకుంటూ పార్టీని ముందుకు తీసుకువెళ్ళాలని ఆకాంక్షించారు. వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బత్తుల వెంకటేశ్వరరావు యువజన సమాఖ్య నుండి పార్టీ వ్యవసాయ కార్మిక సంఘంలో బాధ్యతలు వహించి నూజివీడు నియోజకవర్గంలో సుమారు పాతికవేల ఎకరాల అటవీ బంజరును ఆక్రమింపజేసి 15 ఎకరాలకు పైగా పట్టాలను ఇప్పించిన ఘనత బత్తుల వెంకటేశ్వరరావుది అని కొనియాడారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి కురెళ్ళ వరప్రసాద్,సిపిఐ ఏలూరు ఏరియా కార్యవర్గ సభ్యులు, ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ బళ్ల కనకదుర్గారావు, జిల్లా సమితి సభ్యులు భజంత్రీ శ్రీనివాసరావు, ఏఐటీయూసీ ఏలూరు అధ్యక్షులు కృష్ణమాచార్యులు, ఏరియా కార్యవర్గ సభ్యులు మాపూరి విజయ, అడ్డగర్ల లక్ష్మీ ఇందిర, వీర్ల జగన్నాధరావు, శాయన అభిలాష్ కుమార్, బేతా శంకర్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## సద్వినియోగంపై దృష్టి

(1వ పేజీ తరువాయి)

సందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల అవసరాలు, అభిరుచులు దృష్టిలో ఉంచుకుని స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు నూతన ఆదాయ మార్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా స్వయం సహాయక సంఘాలకు అందిస్తున్న సహాయ సహకారాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ స్వయం ఉపాధి అంశాలపై మహిళలు అవగాహన పెంపొందించుకొని అభివృద్ధి పథంలో పయనించాలన్నారు.

ఇందుకు జిల్లా అధికార యంత్రాంగం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జె.సత్యవతి, జిల్లా సమాఖ్య సభ్యులు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ డీపీఎంలు, ఏపీఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విడుదల చేయాలి

(1వ పేజీ తరువాయి)

చేశారు. రెండు నెలలుగా జీతాలు మంజూరు చేయాలని కాంట్రాక్టర్ను ,ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కలిసి విజ్ఞప్తి చేస్తున్నా స్పందన లేదని పేర్కొన్నారు. తప్పని పరిస్థితుల్లో సమ్మె నోటీసు సూపరింటెండెంటుకు ఇచ్చామని 12 సోమవారం నుండి సమ్మె నిర్వహిస్తున్నామని దీనికి అన్ని వర్గాల వారు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసి నాయకులు వి.కొండలరావు, యూనియన్ అధ్యక్షులు మొలగాడ ప్రసాద్ రావు , కుమార్ ,పెద్దబ్బాయి మోహన్, నరేష్ , సూరిబాబు భాగ్యలక్ష్మి సుశీల అనంతలక్ష్మి విజయలక్ష్మి, మీనాక్షి , గంగ రత్నం వరలక్ష్మి శ్రీనువాస్ , శివ పాల్గొన్నారు.

## అందుబాటులో ఇసుక

(1వ పేజీ తరువాయి)

ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ లక్ష్యం ఉచిత ఇసుక పాలసీ విధానం లో పక్కదారి పట్టకూడదని పేర్కొన్నారు త్వరలో మరో 11 రీచ్‌లను కూడా అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, పేదలకు, ఇళ్ళ నిర్మాణం చేసే వారికే ఇసుకని అందుబాటులోకి తీసుకుని వెళ్ళే క్రమంలో వాస్తవ పరిస్థితికి అనుగుణంగా లభ్యత ఉండేలా చర్యలు తీసుకోవడం రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. కేవలం ఆపరేషనల్ ఖర్చులను మాత్రమే వసూలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో ఉచిత ఇసుక విధాన అమలు తీరు, డి ఎల్ ఎస్ ఎ లో తీసుకున్న నిర్ణయాలను వివరించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ, ప్రజల్లో ఉచిత ఇసుక రవాణా, లోడింగ్, తదితర అంశాలపై స్పష్టత లేకపోవడం వల్ల కొంత అపోహ ఉందన్నారు. వాహన రవాణా ఖర్చుల విషయంలో కూడా స్థిరమైన ధర నిర్ణయించాలన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ఇసుక వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సరఫరా చెయ్యాలన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన ఉచిత ఇసుక సరఫరా పై ప్రభుత్వానికి మంచి పేరు వచ్చే విధంగా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ప్రభుత్వ నిర్మాణ పనులకు ఇసుక లభ్యత ఉండాలన్నారు. లారీ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ టోల్ గేట్ ఫీజు, గ్రీన్ ట్యాక్స్ అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర పాత్రికేయుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ డి. నరసింహ కిషోర్, ఇంచార్జి జేసీ, డీఆర్ ఓ జి. నరసింహులు, శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామ కృష్ణ, ఆదిరెడ్డి వాసు, ముప్పిడి వెంటకేశ్వరరావు, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఆర్ డి ఓ కె ఎల్ జ్యోతి, ఆర్ వి. రమణ నాయక్ నాయక్ ఇరిగేషన్ సి ఈ. పుల్లారావు, ఎస్ ఈ శ్రీనివాసరావు, మైన్స్ ఎ డి సుబ్రహ్మణ్యం డి ఎల్ ఎస్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ధరల నివేదన కేంద్రాల ఏర్పాటుకు అనుమతించండి : ఎంపీ పుట్టా మహేష్

**విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు :** జాతీయ ఆహార భద్రత చట్టం కింద లబ్దిదారులకు మెరుగైన సహాయం అందిస్తూ, రాష్ట్రంలో నూతనంగా 8 'ధరల నివేదన

కేంద్రాల' ఏర్పాటుకు అనుమతి మంజూరు చేయాలని ఏలూరు పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలిసి కేంద్ర ఆహారం, పౌరసరఫరాల శాఖా మంత్రి ప్రహ్లాద్ జోషి, పెట్రోలియం సహజ వాయువుల శాఖామంత్రి హర్దీప్ సింగ్ పూరి లను ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కలిశారు. రాష్ట్రానికి పెరిగిన పప్పుధాన్యాల కేటాయించాలని, జాతీయ ఆహార భద్రతా చట్టం కింద రాష్ట్ర లబ్దిదారులకు మెరుగైన సహాయం అందించాలని కోరారు. రాష్ట్రంలో కొత్తగా 8 'ధరల నివేదన కేంద్రాల' ఏర్పాటుకు అనుమతి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.రూ. 1లక్ష కేటాయింపు ధరల స్థిరీకరణ నిధికి 532 కోట్లు, పెండింగ్ బిల్లులకు రూ. 1187 కోట్లు విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగేళ్ల ఉదయ శ్రీనివాస్, విశాఖపట్నం ఎంపీ మతుకుమెల్లి భరత్, తదితరులు పాల్గొన్నారు.

## పెదపాడు హైస్కూల్లో ఎస్ఎంసి ఎన్నిక ఏకగ్రీవం

**విశాలాంధ్ర-పెదపాడు:** పెదపాడు జిల్లా పరిషత్ హై స్కూల్లో నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఎస్ఎంసి కమిటీ నూతన చైర్మన్‌గా పెదపాడు గ్రామానికి చెందిన వద్దాది నాగ సుబ్రహ్మ

ణ్యం, వైస్ చైర్మన్‌గా పెందిరి నిర్మల కుమారిలను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తొలుత 3-10 తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ కలిసి 24 మంది ని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ చైర్మన్ నాగ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేయడం జరుగుతుంది అన్నారు. వైస్ చైర్మన్ నిర్మల కుమారి మాట్లాడుతూ పాఠశాల రోల్ పెంచేందుకు సహకరిస్తామని చెప్పారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి .వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలలో సౌకర్యాలు కల్పనకు, విద్యార్థులలోవిద్యా ప్రమాణాలు పెంపుదల కు నూతనంగా ఎన్నికైన కమిటీ సహాయ సహకారాలు అందించాలని కోరారు. పెదపాడు ఎంపీడీవో తేజ రతన్ ,తహసిల్దార్ ఎన్‌విడి ప్రసాద్, ఎంఈఓ -2 సభితి నరసింహామూర్తి లు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో పెదపాడు ఎస్సై శుభ శేఖర్ పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన ఎస్ఎంసి కమిటీకి పాఠశాల ఉపాధ్యాయ,ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

## మంత్రి నిమ్మలను కలిసిన సీఐ

**విశాలాంధ్ర - పాలకొల్లు :** పాలకొల్లులో శనివారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఇటీవల పాలకొల్లు పట్టణ సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కే. రజని కుమార్,

మంత్రి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు. పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రి నిమ్మల మాట్లాడుతూ నీతి నిజాయితీతో పనిచేసి మంచి అధికారిగా ప్రజలలో పేరు తెచ్చుకోవాలని సూచించారు. పాలకొల్లు పట్టణ పోలీస్ సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థుల రాకతో ఏపీ నిట్‌లో సందడి

**విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం :** నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఏపీ నిట్) లోని బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు తరలివస్తుండటంతో ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. బీటెక్ లో మొత్తం ఎనిమిది కోర్సులకుగాను 480 సీట్లు ఉన్నాయి. వీటిలో 50 శాతం సీట్లును రాష్ట్ర విద్యార్థులతోను, మిగిలిన వాటిని ఇతర రాష్ట్రాల విద్యార్థులతోను జోసా, సి-సాబ్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తున్నారు. ఇటీవల 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన కౌన్సిలింగ్ లో మొత్తం 480 సీట్లకు అలాట్ మెంట్ లు పూర్తయ్యాయి. సీటు అలాట్ మెంట్ పొందిన విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో ప్రాంగణానికొచ్చి తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకోవటంతో పాటు ఫీజులు చెల్లించి ప్రవేశాలు పొందుతున్నారు. ఈ పరిశీలన ప్రక్రియ ఈ నెల 14 వరకు జరగనుంది. విద్యార్థులందరికీ ఈ నెల 16న ఇండక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నారు.

## ఆరోపణలు నిరాధారం

**విశాలాంధ్ర - కొయ్యలగూడెం :** తనపై చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని కావాలనే, ఉద్దేశ పూర్వకంగా తన పేరుని ఇరికిస్తున్నారని గంగిరెడ్ల మేఘలాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాదులో ఉన్న ఆమె పాత్రికేయులతో చరవాణిలో మాట్లాడుతూ తనపై కొందరు వ్యక్తులు కుట్రపూరితంగా, బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని,అందులో భాగంగానే తనకు సంబంధం లేని విషయాలలో, తన పేరును ప్రస్తావిస్తూ వాట్సాప్ గ్రూపులలో పెడుతున్నారని, దానిని తాను పూర్తిగా ఖండిస్తున్నట్లు ఆమె తెలిపారు. తన ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్న వారందరిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు,తాను వెనకాడబోనని తెలిపారు. తన కుటుంబం ఏమిటో అందరికీ తెలుసని ఆమె అన్నారు.

## కెడ్రన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నిటలాక్షరామ

**విశాలాంధ్ర - కొయ్యలగూడెం :** కెడ్రన్స్ బుక్స్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో కొయ్యలగూడేనికి చెందిన దాసరోజు నిటలాక్ష రామ స్థానం సంపాదించినట్లు తండ్రి శ్రీకాత్యాయనీ పీఠం వ్యవస్థాపకులు, బ్రహ్మశ్రీ దాసరోజు శ్రీనివాసరావు పేర్కొన్నారు.

వేద ప్రామాణికంగా మానవ శరీరంలో ఉండే షట్చక్రాల పేర్లు, వాటి అధిష్టాన దేవతల పేర్లు, కుండలినీ ప్రేరేపణ గురించి, వివరించినందుకు క్రెడెన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో స్థానం దక్కిందన్నారు. పెద్దలకు సైతం కష్టతరమైన షట్చక్రాలను అతి సునాయాసంగా మూడేళ్ల వయసుకే నిటలాక్ష రామ వివరణకు పలువురు అభినందించారన్నారు. నిటలాక్ష చదువు తున్న రాజమండ్రి బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ యాజమాన్య సమక్షంలో, నిర్వాహకులు దీనిని అందజేశారు. ఈ కార్యక్రమంలో డి.యోగానంద్, అప్పలభక్తుల శివకేశవరావు, రాజమండ్రి ఆర్ట్స్ కాలేజి విశ్రాంత బోటనీ అధ్యాపకురాలు జివిపి బాలామణి, నిటలాక్ష రామకు అభినందనలు తెలిపారు.

# అణగారిన వర్గాలకు కూటమి అండ

**విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం:** అణగారిన వర్గాల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక బివిఆర్ కళా కేంద్రంలో సింగం బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజ్యాంగం ఇచ్చిన హక్కులను సద్వినియోగం చేసుకుని గిరిజనులు ఎస్టీలు రాజ్యాధికారం దిశగా ముందుకు వెళ్లాలని సూచించారు. కులం పేరుతో కొందరు స్వార్ధపరులు చేసే పనుల వల్ల అణగారిన వర్గాల్లో వెలుగు దూరమవుతుందని ఎస్సీ, ఎస్టీల కోసం రచించిన చట్టాలు నిర్వీర్యం చేసే దిశగా వారి ప్రవర్తన ఉంటుందన్నారు.

బిజెపి కన్వీనర్ ఈతకోట తాతాజీ మాట్లాడుతూ రాష్ట్రంలోనే కాదు దేశంలోనే అత్యున్నత స్థాయి పదవిని ఎస్టీలకు ఇచ్చిన ఘనత నరేంద్ర మోడీ ప్రభుత్వానికి చెందుతుందని పేర్కొన్నారు. ముందుగా గిరిజనుల సంప్రదాయం నృత్యా లతో పట్టణంలో ర్యాలీ ఆకట్టుకుంది. ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు కొండారెడ్డి నరహరి వరప్రసాద్, దెందులూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి ఘంటసాల వెంకటలక్ష్మి, గిరిజన అవార్డు గ్రహీత సింగం పట్టాభి, ఏపీ ఎస్టీ సంక్షేమ సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సింగం సత్యనారాయణ, అఖిల భారత గిరిజన ఉద్యోగ సంఘ జాతీయ అధ్యక్షులు దేవరకొండ వెంకటేశ్వర్లు, బీసీ నాయకులు కైలా శివ సత్యనారాయణ, ఏపీ ఎస్సీ ఎస్టీ గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సింగం సుబ్బారావు, పట్టణ అధ్యక్షులు సింగం రుద్రయ్య తదితరులు మాట్లాడారు.

## అంబేద్కర్ విగ్రహ ధ్వంసం ప్రజాస్వామ్యానికి మాయనిమచ్చ

**విశాలాంధ్ర - కొయ్యలగూడెం :** ప్రపంచానికే గర్వకారణంగా నిలిచిన, అంబేద్కర్ మహాశయునికి జరిగిన అవమానాన్ని రాజద్రోహంగా ప్రభుత్వం పరిగణించి ద్రోహులపై చర్యలు చేపట్టాలని, అంబేద్కర్ సేవా సంఘాలు డిమాండ్ చేశాయి. గవరవరం అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ విజయవాడలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అన్నారు. ఇందుకు కారకులైన వారు ఏ పార్టీకి చెందిన వారు అయినప్పటికీ నిష్పక్షపాతంగా ప్రభుత్వం వ్యవహరించి ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. ముఖ్యంగా జాతీయ నాయకుల విగ్రహాలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేయటం హేయమైన చర్య అని అన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీటీసీ బిరుదుగట్ల రత్నకుమారి, అంబేద్కర్ అభిమాన సంఘాల సభ్యులు కోసూరి అఖిల్ ,బిరుదుగట్ల రాజు, జుమాల రమణ, దండే బద్రి, దండే రామారావు, కోనాల వెంకట్రావు, కరుటూరి సూరి, కరటూరి కిషోర్ కుమార్,బిరుదుగట్ల ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా కల్వర్టు

**విశాలాంధ్ర-జీలుగుమిల్లి :** ఏజెన్సీ ప్రాంతంలో గత వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలు కారణంగా కల్వర్టు కొట్టుకుపోయి ప్రమాదకరంగా ఉన్నట్లు జీలుగుమిల్లి జగదాంబ ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులు దేవుడు శ్రీను తెలిపారు .శనివారం వంక వారు గూడెం వాగు పై కలవర్టు పూర్తిగా దెబ్బతిన్నట్లు ఆయన తెలిపారు. ఈ రహదారి గుండా సుమారు 10 గిరిజన గ్రామాలు ప్రజలు నిత్యం రాకపోకలు ఉంటాయని అన్నారు .ట్రాక్టర్లు, ఆటోలు ,ద్విచక్ర వాహనాలు ఈ రహదారి గుండా

ప్రయాణిస్తుంటాయి. అయితే భారీ వర్షాలు కారణంగా కల్వర్టు కొట్టుకుపోయింది .వాహనా దారులు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కల్వర్టు వద్ద ఆటోలు, ద్విచక్ర వాహనాలు పడి గాయాల పాలు అయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. గత ప్రభుత్వంలో ఈ కల్వర్టు గురించి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని ఆయన అన్నారు. ఈ ప్రభుత్వంలోనైనా ఈ సమస్యను పరిష్కరించాలని నాయకులను అధికారులను కోరుతున్నట్లు ఆయన తెలిపారు.

**CHANGE OF NAME**

I Ghanta Rama Achyutharamayya S/O Ghanta Bulliya (late) residing at D.No 1-119/1 kamma bazar, Venkatakrishnapuram, Eluru, changing my name from Ganta Achuta Ramayya (old name) to Ghanta Rama Achyutharamayya (New name), Hence forth I am being called as Ghanta Rama Achutharamayya (New name). For all purposes.

**CHANGE OF NAME**

I Ghanta Dinesh Babu S/O Ghanta Rama Achyutharamayya residing at D.No 1-119/1 kamma bazar, Venkatakrishnapuram, Eluru, changing my name from Ganta Dinesh (old name) to Ghanta Dinesh Babu (New name), Hence forth I am being called as Ghanta Dinesh Babu (New name). For all purposes.

**CHANGE OF NAME**

**I, CHINTA VEERA VENKATA LAKSHMANARAO (New Name), S/o CHINTA KRISHNA MURTHY** Previously called **CHINTA LAKSHMANA RAO (Old Name)**, Resident of D.No. 14-7-40/1, Ramayanama Subbanna Thota, Bhimavaram, West Godavari District-534201, Andhra Pradesh. Now Changed my name from **CHINTA LAKSHMANA RAO (Old Name) to CHINTA VEERA VENKATA LAKSHMANARAO (New Name)** Today onwards Use my New Name for all further Transactions.

## ప్రేమ పేరుతో మోసపోయా న్యాయం చేయండి!

**విశాలాంధ్ర-భీమడోలు:** తాను ప్రేమ పేరుతో మోసపోయానని తనకు న్యాయం చేయాలని కోరుతూ నాగేశ్వరి అనే మహిళ పోలీసులను ఆశ్రయించింది. భీమడోలు గ్రామానికి చెందిన నాగేశ్వరి మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం పోలసాని పల్లిలో ఉంటున్న ఈగలాటి రవికుమార్

ప్రేమ పేరుతో మోసగించాడని ఆరోపించింది. రవికుమార్ రెండేళ్లుగా ప్రేమిస్తూ తనతో బలవంతంగా శారీరక సంబంధం పెట్టుకొని, పెళ్లి ప్రస్తావన తీసుకురాగానే రవికుమార్ తన అన్న- వదిన అయిన వీస్సకోటి కృష్ణ-దుర్గలను పిలిపించి నన్ను చంపేస్తానని బెదిరించా రని వాపోయింది. రవికుమార్‌ను తన వెంట తీసుకువెళ్లారని తెలిపింది.తన పెళ్లి విషయమై పెద్దలతో కలిసి విస్సకోటి కృష్ణ-దుర్గ ఇంటికి వెళ్లి నిలదీయగా నువ్వు కులం తక్కువ దానివి, మాకు సరిపోవు మా తమ్ముడితో మళ్లీ నువ్వు తిరిగినట్టు కనపడితే రౌడీలను పెట్టి నిన్ను హత్య చేయిస్తానని బెదిరించాడని మీడియా ముందు కన్నీటిపర్యంతమైంది. దీనిపై భీమడోలు పోలీస్ స్టేషన్లో 2024 జులై నెలలో ఫిర్యాదు చేశానని స్పష్టం చేసింది. పోలీసులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఇకనైనా పోలీసులు తన బాధను అర్థం చేసుకొని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసింది.స్థానిక దళిత నేత గోగులమూడి రవి మాట్లాడుతూ నాగేశ్వరికి న్యాయం జరగకపోతే మహిళా సంఘాలు, దళిత నాయకులతో కలిసి నిరసన, ఆందోళన, ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## తలసేమియా చిన్నారులను ఆదుకోవాలి

**విశాలాంధ్ర -భీమవరం:** తలసేమియా చిన్నారులకు రక్తదానం చేసి ఆదుకుందామని నిండు ప్రాణాలను కాపాడటంలో కలిగే సంతోషమే వేరని, రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజ నేయులు అన్నారు. భీమవరం డెంటల్ కేర్

హాస్పటల్ వద్ద హోప్ చారిటబుల్ ట్రస్ట్, ఉద్దరాజు ఆనంద రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలసేమియా బాధితులకు రక్తదానంపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మనం చేసే రక్తదానం 45 మంది తలసేమియా చిన్నారుల్లో ఒకరికి ప్రాణదానం అవుతుందని, ప్రతి 20 రోజులకు ఒక్కసారి రక్తం ఎక్కించుకునే తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదానం అవసరమని అన్నారు. హోప్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అల్లాడి రవితేజ మాట్లాడుతూ తల్లి జన్మనిస్తే రక్తదాత పున: జన్మనిస్తారని, ప్రతీ 20 రోజులకు ఒకసారి రక్తం ఎక్కించుకొనే వారికి ఫిల్టర్ సెట్స్, మందులు మార్కెట్లో దొరకక బాధపడుతున్న తలసేమియా చిన్నారుల, వారి తల్లిదండ్రుల ఇబ్బందులు పడుతున్న వారి కోసం హోప్ ఫర్ తలసేమియా అవగాహన సదస్సును చేపట్టామని అన్నారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, వబిలిశెట్టి రామకృష్ణ, పొత్తూరి బాపిరాజు, సభ్యులు నూకల శివ, బొల్లం సాయి, సబ్బవరపు వినోద్, గంధం దుర్గాప్రసాద్, కట్టా సత్యనారాయణ, లింగం పవన్ కుమార్, చినపరపు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు ఘనసత్కారం

**విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు:** న్యూఢిల్లీలోని ఎన్.డి.ఎం.సి.కన్వెన్షన్ సెంటర్‌లో నూతనంగా ఎన్నికైన యాదవ బిసి సామాజిక వర్గ ఎంపీలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సమాజ్ వాదీ పార్టీ అధినేత, యూపీ మాజీ ముఖ్య మంత్రి అఖిలేష్ యాదవ్,ఇతర పెద్దలతో కలిసి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పాల్గొన్నారు. అఖిల భారత వర్షియ

యాదవ మహాసభ కె.జి.ఎఫ్. ఇండియా ఆర్గనైజేషన్ వారు నిర్వహించిన ఈ సత్కార కార్యక్రమంలో దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి ఎన్నికైన యాదవ,బీసీ ఎంపీలు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుండి పార్లమెంటుకు ఎన్నికైన ఏలూరు పుట్టా మహేష్ కుమార్ ను అఖిల భారత వర్షియ యాదవ మహాసభ కె.జి.ఎఫ్.ఇండియా ఆర్గనైజేషన్ వారు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సహచర ఎంపీలు బి.నాగరాజు, బీద మస్తాన్ రావు కూడా పాల్గొన్నారు.

## ప్రతి మండలంలో అంబేద్కర్ అధ్యయన కేంద్రం నెలకొల్పాలి

**సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు**

**విశాలాంధ్ర -కామవరపుకోట:** అంబేద్కర్ జీవిత విశేషాలను భావితరాలకు తెలియజేసేందుకు ప్రతి మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అధ్యయన కేంద్రం నెలకొల్పాలని ఎస్.సి., ఎస్.టి., బి.సి., మైనారిటీ, సామాజిక హక్కుల సాధన సమితి చింతలపూడి ఏరియా అధ్యక్షులు, సిపిఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వాడ వాడల భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలు నెలకొల్పి అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆ మహనీయుని మెడలో మనమంతా దండలు వేసి దండాలు పెట్టుకుని తిరిగి మళ్లీ ఏడాది వరకు ఆ మహనీయుని విగ్రహం వైపు చూడకపోవడం భావ్యం కాదన్నారు. అంబేద్కర్ విగ్రహంపై ఎలాంటి మచ్చలు మరకలు పడకుండా చూడవల సిన బాధ్యత భారత పౌరులుగా మనందరిపై ఉందన్నారు. రాజ్యాంగం ద్వారా ఆయన ప్రసాదించిన రిజర్వేషన్లు ఫలాలను అనుభవిస్తున్న ప్రజా ప్రతినిధులు ఉన్నతాధికారులు అంబేద్కర్ జీవిత విశేషాలను భావితరాలకు అందించే ప్రయత్నం చేయాలన్నారు.

## రామచంద్రరావు మృతికి సంతాపం

**విశాలాంధ్ర - కామవరపుకోట :** దశాబ్దాల పాటు సిపిఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని హైదరాబాదులో సిపిఐ రాష్ట్ర కార్యాలయం కార్యదర్శిగా సుదీర్ఘకాలం సేవలు అందించిన రామచంద్రరావు మృతికి సిపిఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు, సహాయ కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు శనివారం ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలిపారు. రామచంద్రరావు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి పార్టీ కార్యకర్తలకు వచ్చే పార్టీ నాయకులను, ప్రజా సంఘాల నాయకులను, కార్యకర్తలను గౌరవించి ఆదరించే వారని అన్నారు. కొన్నిసార్లు రాష్ట్ర పార్టీ కార్యాలయం మగ్దుంభవన్లో జరిగే సైద్ధాంతిక రాజకీయ శిక్షణ తరగతులకు తాను వలుసార్లు హాజరయ్యానని తెలిపారు. రాజకీయ శిక్షణకు వచ్చిన పార్టీ శ్రేణులను రాష్ట్ర పార్టీ ఆఫీసు కార్యదర్శిగా కాక వచ్చిన వారిని తన కుటుంబ సభ్యులుగా ఆదరించి , అభిమానించిన రామచంద్రరావు మృతి సిపిఐకి తీరని సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు జీ సత్యనారాయణ, టి రాములమ్మ, చలమాల శ్రీనివాసరావు, స్వామి దాసు, మీనుకగుల దుర్గారావు, ఏఐటీయూసీ నాయకులు బివి రాఘవులు, కోతాటి వెంకటేశ్వరరావు,నల్లమోతుల అప్పన్న, బాలిన రమణారావు, మారం సత్యనారాయణ, ప్రగాఢ సంతాపం తెలిపి ఆయన కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు.

## డిజిటల్ క్లాస్ రూమ్ ప్రారంభించిన ఎమ్మెల్యే నాయకర్

**విశాలాంధ్ర - మొగల్తూరు:** మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ చల్లా వారి మెరక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం నార్ద్ ఆంగ్లేయ ఎద్యుకేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆర్థిక సహకారంతో చల్లా బెనర్జీ , మేళం సోమ సత్య రంగనాథన్ సౌజన్యంతో నిర్మించిన డిజిటల్ క్లాస్ రూమ్ ను నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, టిడిపి ఇన్చార్జి పొత్తూరి రామరాజు, జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో స్థల దాతలు చల్లా వీర వెంకట సత్యనారాయణ, చల్ల దానయ్య నాయుడు, చల్లా రేణుక శ్రీనివాస్, నార్డ్ ఆంగ్లయ ఎద్యుకేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు సున్న సునీల్ కుమార్, వీర నరేంద్ర, కే ఆనంద్, ఎం. సురేష్ కుమార్ యాదవ్ తదితరులను ప్రజా ప్రతినిధులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మొగల్తూరు మండల టిడిపి అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, మొగల్తూరు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు కొల్లాటి గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి కృషి

**మంత్రి కొలుసు పార్థసారథి**

**విశాలాంధ్ర-ముసునూరు:** నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి పెద్ద పాలేరును అవుతానని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. ,ముసునూరు మండలం గోపవరం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్ రాష్ట్ర గృహనిర్మాణ సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పున పునః ప్రారంభించారు.

గతంలో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా ఉండడంతో అదే గ్రామానికి చెందిన ఎన్, ఆర్, ఐ, కే, శివ రూ.60 వేల ఆర్థిక సహాయంతో మరమ్మత్తులు చేపట్టి నిర్మించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎన్నో వేలకోట్లు ఖర్చు చేస్తుందని దీన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో ప్రతీ పేదవాడు సొంత ఇల్లు ఉండా లనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఉందని, వచ్చే మార్చిలో ఇల్లు కట్టుకొనే ప్రతీ ఒక్కరికీ రూ. 4.30 లక్షలు ఆర్థిక సహాయం అందిస్తుందని దీన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 63 మంది పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి

**విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు :** పంచాయతీ రాజ్ శాఖలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ సహాయకులకు పదోన్నతి అవకాశం కల్పించింది.

దీనిలో భాగంగా పంచాయతీ రాజ్ డైరెక్టర్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాలు మేరకు జిల్లాలో 80 మంది గ్రేడ్-2 జూనియర్ సహాయకులు, శానిటరీ ఇన్స్పెక్టర్లకు గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతికి అర్హత సాధించారు. అయితే వీరిలో 17 మంది వ్యక్తిగత కారణాలు వలన పదోన్నతి వదులుకోగా 63 మందికి జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి పదోన్నతి ఉత్తర్వులు జారీ చేసారు. ఈ సందర్భంగా గ్రేడ్-2గా పదోన్నతి పొందిన సిబ్బంది జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ను మర్యాద పూర్వకంగా కలిసి ఉత్తర్వులు కాపీ తీసుకున్నారు. పదోన్నతి కోసం ఏళ్ళ తరబడి నిరీక్షణ చేశామని, కూటమి ప్రభుత్వంలో న్యాయం జరిగిందని పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## సబ్సిడీపై రైతులకు వరి విత్తనాలు అందజేత

**విశాలాంధ్ర - గణపవరం:** ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి ప్రభుత్వం అని ఉంగుటూరు నియోజకవర్గం శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం నిడమర్రు మండలం భువనపల్లి గ్రామ రైతు భరోసా కేంద్రం వద్ద ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా నారుమడులు నష్టపోయిన రైతులను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం 80% సబ్సిడీ పై పంపిణీ చేయబడే వరి విత్తనాలను నిడమర్రు మండలం రైతులకు ఎమ్మెల్యే ధర్మరాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాలతో రైతులు నష్టపోయారని ఈ నేపథ్యంలో వారికి అండగా ఉండాలనే ఉద్దేశ్యంతో వరి విత్తనాలను 80% సబ్సిడీ పై రాష్ట్ర ప్రభుత్వమే పంపిణీ చేస్తుంది అన్నారు. ఈ మేరకు రైతులందరు సబ్సిడీ పై అందజేసే విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గత ప్రభుత్వం వ్యవసాయ రంగంపై నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించటంతో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు అని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మండల, గ్రామ జనసేన, టీడీపీ, బీజేపీ అధ్యక్షులు, నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు ముగిసిన శిక్షణ

**విశాలాంధ్ర - యానాం :** యానం నియోజకవర్గంలో గత మూడు రోజులుగా మత్స్యకారులకు ఇచ్చే శిక్షణలో భాగంగా పీఎం ఎంఎస్వై పథకం క్రింద ఎన్ఎఫ్డిబి నిధులతో మత్స్య శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా సిఫ్నెట్ శిక్షణ ఇచ్చిన నైపుణ్య అభివృద్ధి కార్యక్రమం శనివారం ముగిసింది. ముగింపు సభలో ముఖ్య అతిథిగా పరిపాలన అధికారి ఆర్. మునిస్వామి సూచనలను ఇచ్చి ధృవీకరణ పత్రాలను అందజేశారు. బోట్ ఇంజన్ లోపాలు సరిదిద్ద డం, నిర్వహణ అనే అంశం పై సిఫ్నెట్ అధికారులు వివిల్ పూజర్, హరనాథ్, అర్జున్ మూడురోజుల పాటు శిక్షణ ఇచ్చారు. మత్స్య శాఖ అధికారి గోంతియ్య తదితర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనం జయప్రదం చేయాలి

**విశాలాంధ్ర-ఏలూరు:** సెప్టెంబర్ 1 నుండి 3 వరకు వైజాగ్లో జరుగుతున్న ఏఐటియుసి జాతీయ సమితి సమ్మేళనాలను ఉద్యోగ, కార్మికులు, జయప్రదం చేయాలని ఏఐటియుసి ఏలూరు ఏరియా కార్యదర్శి ఎ. అప్పలరాజు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కోట దిబ్బ ఎస్సార్ వన్ వద్ద వైజాగ్లో జరుగుతున్న ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాల గోడ పత్రికలను ది జోనల్ మునిసిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు, కార్యకర్తలు, ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ 104 సంవత్సరాల చరిత్ర కలిగిన ఏఐటీయూసీ కేంద్రంలో బిజెపి నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా అనుసరిస్తున్న కార్మిక, ప్రభుత్వ రంగ పరిశ్రమలకు వ్యతిరేక విధానాలపై ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఏఐటియుసి భారతదేశ ఉద్యోగ, కార్మిక వర్గానికి అనేక ఉద్యమాలు పోరాటాలు త్యాగాలతో సాధించిన 44 కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం నాలుగు కార్మిక కోడ్లుగా మార్చడానికి ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాలను జయప్రదం చేయుటకు ఉద్యోగ, కార్మికులు తమ సహాయ సహకారాలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ట్యాప్ ఇన్స్పెక్టర్ సిహెచ్ హరినాధ బాబు, ఫిట్టర్ బి. దుర్గారావు, యూనియన్ నాయకులు ఎస్ఎంవి సుబ్బారావు, డి. వెంకటేష్, ఎం. సయ్యద్ బాజీ, సిహెచ్ విజయ్, ఎస్. గౌరీ శంకర్, కే వెంకటేశ్వరరావు, ఎం ఆది నారాయణ, ఆర్. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ ఏరియా అధ్యక్ష, కార్యదర్శులుగా రాజు, హరీష్

**విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం:** కార్మికోద్యమాన్ని పటిష్టం చేసి విస్తరింప చేయాలని ఏఐటీయూసీ తాడేపల్లిగూడెం ఏరియా కమిటీ సర్వసభ్య సమావేశం

నిర్ణయించింది. సిపాయిపేట భవననిర్మాణ కార్మికసంఘం కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ అధ్యక్షత వహించారు. ఏరియా కమిటీకి అనుబంధంగా ఉన్న పన్నెండు కార్మికసంఘాల నాయకులు కార్యకర్తలు హాజర య్యారు. గత మూడేళ్లగా నిర్వహించిన కార్యకలాపాలను సమావేశంలో సమీక్షించారు. కార్మికుల సమస్యలపై, భవిష్యత్ కార్యక్రమాలపై పలువురు సభ్యులు మాట్లాడారు.ఈ సందర్భంగా ఏరియాసమితి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా డి.సోమసుందర్, అధ్యక్షునిగా ఓ.వి. రాజు, ఉపాధ్యక్షులుగా పడాల శ్రీనివాస్, తాడికొండ శ్రీనివాసరావు, మేళం నాగరాజు, కార్యదర్శిగా మండలపర్తి హరీష్, సంయుక్త కార్యదర్శిగా కళింగ లక్ష్మణరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కే.లక్ష్మీనారాయణ (కే.ఎల్.) , సహాయ కార్యదర్శులుగా తాడేపల్లి వెంకటేష్, ఆకుల కాటమరాజు, కోశాధికారిగా కొడమంచిలి చంద్రరావు ఎన్నికయ్యారు. మరో 25 మంది సభ్యులతో ఏరియా కౌన్సిల్ ఏర్పడింది. సెప్టెంబర్ మొదటివారంలో విశాఖపట్టణంలో నిర్వహిస్తున్న ఏఐటియుసి జాతీయ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా ఒకటో తేదీ జరగనున్న బహిరంగసభను విజయవంతం చేయాలని సమావేశం నిర్ణయించింది.

## రావులపాలెం సీఐగా విద్యాసాగర్

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెం సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా సిహెచ్ విద్యాసాగర్ నియమితులయ్యారు. ఆయన బాధ్యతను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో గల గ్రామాలలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రతిష్ట చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. యువత గంజాయి, మత్తు బారినపడి చెడు వ్యసనాలకు బానిసవుతున్నారని వారి తల్లి దండ్రులకు అవగాహన కల్పించి వారు మంచి మార్గంలో నడిచేలా చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. గంజాయి రవాణాపై ఉక్కు పాదం మోపినట్లు ఆయన పేర్కొన్నారు.

## మంత్రి కొల్లు రవీంద్రకు ఘన స్వాగతం

విశాలాంధ్ర - రావుల పాలెం : రావుల పాలెంలో ఇసుక, సహజ వనరుల లభ్యతపై అమలాపురం కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష జరపడానికి జిల్లాకు విచ్చేసిన మంత్రి కొల్లు రవీంద్రకు కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు ఘన స్వాగతం పలికారు. మంత్రిగా తొలిసారిగా కోనసీమ జిల్లాకు వచ్చిన మంత్రి రవీంద్రకు బండారు పుష్ప గుచ్ఛం అందించి సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కెవి సత్యనారాయణ రెడ్డి, గుత్తుల పట్టాభి, చిలువూరి సతీష్ రాజు, ధరణాల రామకృష్ణ, జక్కంపూడి వెంకటస్వామి, చిన్న కెవి, పెచ్చేటి చినరావు, కొనాల అంబేడ్కర్, కోట వెంకటేశ్వరరావు , తదితరులు పాల్గొన్నారు.

## బెంగాల్ పార్టీఉద్యమంలో బుద్ధదేవ్ పాత్ర విలువైనది

విశాలాంధ్ర - దేవరపల్లి : బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్యకు నివాళి కార్యక్రమం శనివారం దేవర పల్లిలో నిర్వహించారు. సీపీఎం సీనియర్ నాయకులు కొత్తగుంట రత్నాజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత బుద్ధదేవ్ చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు పిన్నమ్మ నేని సత్యనారాయణ సభ్యులు దుర్గారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం తూర్పుగోదావరి జిల్లా కమిటీ సభ్యులు ఎం. సుందర్ బాబు మాట్లాడుతూ బెంగాల్ పార్టీఉద్యమంలో కామ్రేడ్ బుద్ధదేవ్ బట్టాచార్య పాత్ర ఎంతో విలువైందని, 35 సంవత్సరాల పాటు మంత్రిగా పనిచేశారని,11 సంవత్సరాలు ముఖ్య మంత్రిగా పని చేసారని తెలిపారు. సెమీ ఫాసిస్టు టెర్రరిజం వచ్చిన సమయంలో విద్యార్థి ఉద్యమంలో అనిల్ బిశ్వాస్తో కలిసి అత్యంత కీలకంగా వ్యవహరించారని తెలిపారు. చనిపోయే వరకూ రెండుగదుల ఇంట్లోనే నివసిస్తూ నిరాడంబర జీవితం గడిపారని అన్నారు. బుద్ధదేవ్ భట్టాచార్య ప్రజా ఉద్యమంతోపాటు రచయితగా సాంస్కృతిక ఉద్యమంతో ఆయన జీవితం ముడిపడి ఉందని తెలిపారు. బెంగాల్లో కమ్యూనిస్టు చరిత్ర మహోన్నతమైందని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే బుద్ధదేవ్ కు అర్పించే ఘన నివాళని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పిన్నమని సత్యనారాయణ వేల్పూరి దుర్గారావు జుత్తుగ శీను హబీబ్ ఎం రమేష్ నాగు తదితరులు పాల్గొన్నారు

## ఇసుక సరఫరా విధానంపై సమీక్ష

విశాలాంధ్ర - కొవ్వూరు : స్థానిక రాజమహేంద్రవరం కలెక్టర్ సమావేశం మందిరంలో ఇసుక సరఫరా విధానంపై సమీక్ష సమావేశంలో పాల్గొన్న కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వేంకటేశ్వర రావు మాట్లాడుతూ, ఇసుక రవాణా చేసే వాహనాల బరువు విషయం రహదారుల సామర్థ్యం అనుగుణంగా దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఇసుక రవాణా చేసే వాహనం వేచి ఉండే సమయం తగ్గేలా క్రమబద్ధీకరణ చర్యలు తీసుకోవాలని కోరారు. మరిన్ని రీచ్‌లు అందుబాటులోకి తీసుకురా వడం, బోట్స్ మ్యాన్ సొసైటి సభ్యులకి పెండింగ్ సొమ్ము చెల్లించాలని కోరా రు. ఈమేరకు చర్యలు తీసుకుంటామని మంత్రి రవీంద్ర హామీ ఇచ్చారు.

# గ్రామ సంక్షేమం, అభివృద్ధే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే మద్దిపాటి

విశాలాంధ్ర - గోపాలపురం : ప్రజారోగ్య పరిరక్షణకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తుందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. శనివారం మండలం లోని వేళ్ళ చింతల గూడెం గ్రామంలో గ్రామ ఆరోగ్య కేంద్రాన్ని (విలేజ్ క్లినిక్), పెద్దాపురం గ్రామంలో దాతల సహకారంతో నిర్మించిన ఉచిత రక్షిత వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే మద్దిపాటి లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా వేళ్ళ చింతల గూడెం గ్రామంలో గ్రామ ఆరోగ్య కేంద్రం 20 లక్షల ఇరవై వేల రూపాయలతో నిర్మాణం చేపట్టిన భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం పెద్దాపురంలో కొర్లపాటి. కొర్లపాటి రామారావు పుష్పవతి, వారి కుమారుడు వీర కృష్ణ జ్ఞాపకార్థం వారి కుమారుడు రవికాంత్ ఆర్థిక సౌజన్యంతో, పార్టీలకు అతీతంగా నేను సైతం ఉన్నానంటూ గ్రామానికి తన వంతు సహకారంతో 8 లక్షల రూపాయలతో రక్షిత వాటర్ ప్లాంట్ ను నిర్మించి గ్రామస్తులకు పూర్తిపై వాటర్ ఉచితంగా అందిస్తూ, స్వల్ప ధరతో కూలింగ్ వాటర్ అందిస్తున్నట్లు రవికాంత్ తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రారంభించిన నాటినుండి ఒక ప్రక్క ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ, ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేందుకు ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పదం వైపు నడిపించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం తొమ్మిది లక్షల 74 వేల కోట్ల రూపాయలు అప్పుల ఊబిలో కూరుకుపోయి నప్పటికీ అభివృద్ధి చేయాలి సంక్షేమంతో ముందుకు తీసుకెళ్లాలని దృఢ సంకల్పంతో ఉన్నారని,. గ్రామ స్వరాజ్యం కోసం ప్రతి పల్లెను అభివృద్ధి పదం పై పరిపాలన కొనసాగుతుందని తెలిపారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ విప్లవాత్మకమైన మార్పులను తీసుకొస్తూ విద్యా అభివృద్ధికి, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. గోపాలపురం నియోజకవర్గంలో ఎస్ఎంసి ఎన్నికలలో 215 పాఠశాలల్లో జరిగిన ఎన్ని నూటికి నూరుశాతం ఎస్ఎంసి చైర్మన్ పదవులు ఎన్డీఏ కూటమి బల పరిచిన అభ్యర్థులు గెలుపొందడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు, ఎంపీపీ ఉండవల్లి .సత్యనారాయణ, జడ్పిటిసి లలిత, ఎంపీ డీవో రమేష్, టిడిపి మండల అధ్యక్షు, కార్యదర్శులు సత్యనారాయణ, రమేష్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు రామతులసి సర్పంచ్ దండియ్య. టీడీపీ సీనియర్ నాయకులు అన్నవరం, ఆర్ అండ్ ఎం ఫౌండేషన్ అధినేత మధుకృష్ణ, జగదీష్, రాంబాబు, కొర్లపాటి. రాము, నాగరాజు, ముత్యాలరాయుడు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహంపై దాడి అనైతికం

విశాలాంధ్ర - అమలాపురం, ఉప్పలగుప్తం : విజయవాడ స్వరాజ్ మైదానంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం పై దాడి అనైతిక చర్య అని ఇది దళితుల మనోభావాలను దెబ్బతీసిందని అమలాపురం నియోజకవర్గం వైసిపి సీనియర్ నాయకుడు గుడ్ ఫీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచె రమణారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఉప్పలగుప్తంలో శనివారం రమణారావు విలేకరులతో మాట్లాడుతూ అంబేద్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై దాడి దేశ ప్రజలను అవమానించడమేనన్నారు. కూటమి ప్రభుత్వ ఆరాచకాలు రోజురోజుకు పెరుగుతున్నాయని అంబేద్కర్ స్మృతి వనం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాలు విద్యుత్ దీపాలు ధ్వంసం చేయడం దారుణం అన్నారు. ఈ దాడికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాజీ సిఎం వైఎస్ జగన్ ఒక చారిత్రక ఘట్టానికి ఆధ్యుడిగా నిలిచారని ఇది సహించలేక ఇటువంటి దుర్మార్గపు చర్యలకు పూనుకోవడం సిగ్గుచేటని అన్నారు. భావితరాలకు స్ఫూర్తిగా దిక్సూచిగా పెట్టిన అంబేద్కర్ విగ్రహాన్ని తొల గించే కుట్రలో భాగంగా ఈ దాడి జరిగిందన్న అనుమానాలు దళితుల్లో వ్యక్తమవుతున్నాయని అన్నారు. తక్షణం కేంద్ర ప్రభుత్వం స్పందించి ఘటనపై విచారణ జరిపిం చడమే కాకుండా బాధ్యులను అరెస్టు చేయాలని కేంద్ర బలగాలతో అంబేద్కర్ విగ్రహానికి రక్షణ కల్పించాలని రమణారావు డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపట్టేందుకు దళితులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రమణారావు వెంట నాయకులు పినిపె జయరాజు, నేలపూడి సుగంధ కుమార్, నేరేడుమిల్లి శ్రీను, గంటా లక్ష్మీప్రసాద్, పరమట రాజేష్, కుంచె అర్జున్, నడింపల్లి సుబ్బరాజు తదితరులు ఉన్నారు.

# కూలిన వంతెన - నిలిచిన రాకపోకలు

విశాలాంధ్ర - రాజానగరం : నియోజకవర్గంలోని పుష్కర కాలువ నుండి వస్తున్న నీటి ప్రవాహానికి పాకలరేవు వంతెన కూలిపోయింది.వివరాల్లోకి వెళ్తే రాజానగరం మండలంలోని నందరాడ, కలవచర్ల నుండి కోరుకొండ మండలం గాదరాడ గ్రామాలను అనుసంధానం చేసేందుకు నిర్మించిన పాకలరేవు వంతెన(కల్వర్టు) కొంత కాలంగా అధ్వానంగా తయారైంది. దీంతో ఆయా గ్రామాల మీదుగా ప్రవహిస్తున్న పుష్కర కాలువలో నీటి ప్రవాహం పెరగ దంతో శనివారం ఒక్కసారిగా కూలిపోయింది. ఆ సమయానికి అటుగా ప్రయాణికులు లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానిక రైతులు చెప్పారు. దీంతో గ్రామాలకు వెళ్ళే మార్గం లేకపోవడంతో వాహనాలు, ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కలవచర్ల గ్రామ సర్పంచ్ పిల్లా రాజబాబు మాట్లాడుతూ వాహనదారులు ఎటువంటి ప్రమాదాల బారిన పడకుండా రోడ్డు కి ఇరువైపులా కంచె వేశామని తెలిపారు.

**కల్వర్టు సహాయ చర్యలు చేపట్టండి :**

పుష్కర కాలువ నుండి వస్తున్న నీటి ప్రవాహం తగ్గిన వెంటనే కల్వర్టు కోసం సహాయ చర్యలు చెప్పట్టాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అధికారులకు సూచించారు. కల్వర్టు కూలిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆయన వెంట ఇరిగేషన్ డిపార్ట్మెంట్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, జనసేన తెలుగుదేశం బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఖండవల్లి రాజు మృతికి జర్నలిస్టుల సంతాపం

విశాలాంధ్ర - అమలాపురం : విశ్వం వాయిస్ ఎండి ఖండవల్లి డేవిడ్ రాజు ఇటీవల తీవ్ర అనారోగ్యంతో మరణించారు. శనివారం అమలాపురం జిడిఎం చర్చిలో దశదినఖర్మ సందర్భంగా ప్రార్థనా కూడికను నిర్వహించారు. సందర్భంగా అమలాపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొండేపూడి సత్యనారాయణ ఆధ్వర్యంలో ట్రేజరర్ పంది బాబు, మోత వేంకటేశ్వరరావు, శామ్యూల్ తదితరులు డేవిడ్‌రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొండేపూడి సత్యనారాయణ, దివంగత రాజు సేవలను కొనియాడారు. కార్య క్రమంలో బిజెపి నాయకుడు దూరి రాజేష్, గొల్లపల్లి గోపి, డేవిడ్ రాజు సోదరుడు ఖండవల్లి సునీల్ కుమార్, రిపోర్టర్ రత్నం, కుప్పాల బుజ్జి తదితరులు పాల్గొని డేవిడ్ రాజు మృతికి సంతాపం తెలిపారు.

## పెదపూడి తహశీల్దార్‌గా సీతాపతి



విశాలాంధ్ర - పెదపూడి : పెదపూడి తహసీల్దార్గా సీతాపతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇంతవరకు కాకినాడ అర్బన్ తహసీల్దార్గా పనిచేసి ఇక్కడకు బదిలీ అయ్యారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇంతవరకు తహసీల్దార్గా పని చేసిన రాజ్‌కుమార్ తిరిగి ఏలూరు వెళ్లిపోవడంతో ఆ స్థానంలో సీతాపతి బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ రామ్ కుమార్, ఆర్ఐ ఎం త్రివేణి, వీఆర్వోలు గొల్లపల్లి అంజిబాబు, కర్రెడ్ల రమేష్, ఏడుకొండలు, గణపతి, భాగయ్య, పంపన శ్రీను తదితరులు పుష్ప గుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు.

## సుప్రీంకోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలి

### వర్గీకరణ అమలు జరగాలంటే మన శక్తి నిరూపించుకోవాలి : ఎమ్మార్పీఎస్ నాయకులు

**విశాలాంధ్ర - కపిలేశ్వరపురం :** అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం వల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వీర్రా జిల్లా నాయకులు దూలి జయ రాజు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వేంటనే అమలు చేసుకోనేందుకు, వర్గీకరణ సాధకులు మందకృష్ణ మాదిగకు స్వాగతం తెలిపేందుకు ఈ నెల 13న హైదరాబాద్‌లో జరిగే మాదిగల మహా ప్రదర్శనకు జిల్లా నుంచి పార్టీలకు అతీతంగా, సంఘాలకు అతీతంగా భారీ స్థాయిలో హైదరాబాద్ చేరుకుందాం కపిలేశ్వరపురం మండల మాదిగ ప్రజలు అందరూ కూడా హైదరాబాద్ తరలి రావాలని ఆయన తెలిపారు. మాదిగల జీవితాల్లో వెలుగులు నింపే సూర్యుడు ఢీల్లి నుంచి వస్తున్నాడని ప్రతీ పల్లెలో దండోరా వేసి ప్రజలందరికి తెలియజేద్దాం అని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కపిలేశ్వరపురం మండల ఎతీజూం నాయకులు యార్లగడ్డ ఆశీర్వాదం, మాదిగ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పలివెల రోశేష్, మాదిగ ఎంఆర్పీఎస్ మండల ప్రెసిడెంట్ మడికి లక్ష్మణ్, మాదిగ వల్లూరు గ్రామ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఖండవల్లి శ్రీను, వల్లూరు ప్రతీఖుి ఎతీజూం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పాఠశాల కమిటీ ఎన్నికలు

**విశాలాంధ్ర - కపిలేశ్వరపురం :** అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలంలో ప్రశాంతంగా పాఠశాల యాజ మాన్య కమిటీ ఎన్నికలు జరిగాయి. వాక తిప్ప, మాచర, టేకి, కోరుమిల్లి వంటి పలు గ్రామాలలో ఏకగ్రీవంగా ఎస్ఎంసి ఎన్నికలు ముగిశాయి. గతంలో తీవ్ర పోటీ ఏర్పడిన మాచర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక ఈసారి ప్రశాంతంగా జరిగింది. ఆ పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్‌గా కొండిశెట్టి భీమేశ్వరరావును తల్లి తండ్రులు చేతులు ఎత్తి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కాలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్‌గా పలివెల రమేష్‌ని ఎన్నుకున్నారు. అనంతరం పాఠశాల యాజమాన్యం కమిటీ వారిచే ప్రధానోపాధ్యాయులు ప్రమాణ స్వీకారం చేయిం చారు. పాఠశాలలలో మౌళిక వసతులు కల్పనకు, పిల్లలు ప్రభుత్వ పాఠశా లలో చదువుకునేలా కృషి చేస్తామని నూతన పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్లు ప్రతిజ్ఞ చేశారు. కాలేరు గ్రామంలో సర్పంచ్ దాయం కావేరి, ఆయా గ్రామాల వీఆర్వోలు, మహిళా పోలీసులు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

## యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు

**విశాలాంధ్ర - దేవరపల్లి :** దేవరపల్లి మండల పరిషత్ పాఠశాలలో శనివారం యుటిఎఫ్ సర్వోత్సవాలు ప్రారంభమయ్యాయి జిల్లా గౌరవ అధ్యక్షుడు యుటిఎఫ్ జండా ఎగరవేశారు. ఈ సందర్భంగా శంకరుడు మాట్లాడుతూ యుటిఎఫ్ ఏర్పడి 50 సంవత్సరాలు అయిందని, యుటిఎఫ్ ఏర్పడిన తర్వాతే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం అవుతున్నాయని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఉమాకాంత్ , ఓరు గంటి శివ, ప్రసాద్ రాజు, కొడమంచిలి భూషణం, విజయబాబు, రమాజానికి , పోలుమాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు

## గుండెపోటుతో ఏఎస్ఐ మృతి



**విశాలాంధ్ర - ప్రత్తిపాడు :** ప్రత్తిపాడు ఏఎస్ఐ పి పెద్దబ్బాయి (60) శనివారం తెల్లవారు జామున గుండె పోటుతో మృతి చెందారు. ఆయన స్వగ్రామం రాజ వొమ్మంగి మండలం లాగరాయి గ్రామం. పెద్దబ్బాయి కానిస్టేబుల్‌గా పోలీస్ డిపార్ట్మెంట్‌లో చేరి, అంచలంచెలుగా ఏఎస్ఐగా పదోన్నతి పొంది ప్రత్తిపాడు ఏఎస్ఐగా పని చేస్తున్నారు. ఆయన భార్య ఇద్దరు కుమారులతో ఏలేశ్వరంలో నివశిస్తున్నాడు. పెద్దబ్బాయి ఆకస్మిక మృతి పట్ల ప్రత్తిపాడు సిఐ శేఖర్ బాబు, ఎస్సై పవన్ కుమార్ సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## అంబేద్కర్ విగ్రహంపై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలి

**విశాలాంధ్ర - గండేపల్లి :** గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి జై భీమ్ యువజన సేవ సంఘం నివాళులర్పించారు. లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట ఇంచార్జ్ సాదే నరేంద్ర మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి దళితుల ఆత్మ గౌరవంగా విజయవాడ నడిబొడ్డున ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 125 అడుగుల విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున ఆవిష్కరించారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయడానికి అధికారపక్షం ఏదైతే ఉందో రాత్రి సమయంలో కరెంటు తీసివేసి స్మృతి వనంలో ఉన్నటువంటి పేర్లు తొలగించి అంబేద్కర్ విగ్రహం మీద రాళ్లు దాడి చేశారు. చాలా నీచమైన పనిగా భావిస్తూ ఎవరైతే దోషులు ఉన్నారో వారిని అధికార పక్షంలో ఉన్న ప్రభుత్వం వెంటనే సిబిఐ ఎంక్వైరీ వేసి దోషులను పట్టుకుని ఉరిశిక్ష వేసేదాకా దళితుల ఆత్మ గౌరవం చల్లారదని ఆయన తెలియజేశారు. భారతదేశంలో రాజ్యాంగం అనేది అమలవుతుందా లేదా అని ఆయన వ్యక్తం చేశారు. రాజ్యాంగం అనేది ఉంటే రాజ్యాం గం రచించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి ఇలాంటి అవ మానం జరగదని ఆయన తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో జైభీమ్ యువ జన సేవా సంఘం సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కుల, మతాలకతీతంగా సేవలందించాలి

**విశాలాంధ్ర - అనపర్తి :** కుల, మత, రాజకీయాలకతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కర్రి త్రినాథ్ రెడ్డి అన్నారు. శనివారం కొప్పవరం గ్రామ రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో త్రినాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందుగా యోగి వేమన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కొప్పవరం రెడ్డి సంక్షేమ సంఘం నూతన అధ్యక్షునిగా కర్రి విజయ భాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షులు కొవ్వూరి దుర్గా గోపా ల రామారెడ్డి, కార్యదర్శి పోతంశెట్టి ఆదిరెడ్డి, జాయింట్ సెక్రెటరీ కర్రి దేవి ప్రసాద్ రెడ్డి, కోశాధికారిగా పడాల వీర్రాఘవ రెడ్డి, ఇతర కార్య వర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. అనంతరం కోస్తా ఆంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం కార్యదర్శి సత్తి వీర్రెడ్డి నూతన కార్యవర్గం సభ్యులతో ప్రమాణం చేయించారు. కోస్తాంధ్ర గౌరవాధ్యక్షులు పడాల సుబ్బారెడ్డి మాట్లా డుతూ రక్తదాన శిబిరాలు నిర్వహించి ఆపదలో ఉన్న వ్యక్తులకు అందించాలని కోరారు. నూతన కార్యవర్గ సభ్యులను కోస్తాంధ్ర రెడ్డి యువజన సంక్షేమ సంఘం అధ్యక్షులు తాడి చంద్రశేఖర్ రెడ్డి, చింతా గోపాలకృష్ణారెడ్డి, సత్తి సూరారెడ్డి బ్రదర్స్, వెలగల లక్ష్మీనారాయణ రెడ్డి, డాక్టర్ మల్లిడి అమ్మిరెడ్డి, తేతలి నారాయణ రెడ్డి ఘనంగా సత్కరించారు. నూతన కార్యవర్గాన్ని సర్పంచ్ కర్రి బులి మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటరా మారెడ్డి, ఉప సర్పంచ్ మల్లిడి వీరా ఘవ రెడ్డి, కొంకుదురు రెడ్డి సం ఘం కార్యదర్శి వీర్రెడ్డి అభినందించారు.

## భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అందుకోవాలి

### చౌదరి జన్మదిన వేడుకలో ఎమ్మెల్యే ముప్పిడి

**విశాలాంధ్ర - కొవ్వూరు :** జొన్నలగడ్డ చౌదరి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు, శిఖరాలను అందుకోవాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు అన్నారు. కొవ్వూరు టిడిపి నియోజకవర్గ టూ మెన్ కమిటీ సభ్యులు, తెలుగు రైతు రాష్ట్ర కార్య నిర్వాహక మాజీ కార్యదర్శి జొన్నలగడ్డ సుబ్బారాయ చౌదరి జన్మ దిన వేడుకలు శనివారం ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి అంచలంచలుగా ఎదుగుతూ కొవ్వూరు నియోజకవర్గాన్ని టిడిపి కంచు కోటగా నిలిపిన వ్యక్తి చౌదరిని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఆయన మరింత ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మరో టూ మెన్ కమిటీ సభ్యులు కంఠమని రామకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ సూరప నేని చిన్ని, పట్టణ టిడిపి అధ్యక్షులు దాయన రామకృష్ణ, అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు మద్దిపట్ల శివరామకృష్ణ, పట్టణ టిడిపి మాజీ అధ్యక్షులు ముద్దుల సత్యనారాయణ, తెలుగు యువత మాజీ అధ్యక్షులు పొట్రు శ్రీనివాస్ ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కరిబండిలో ప్రెషర్స్ డే వేడుకలు

**విశాలాంధ్ర - తాళ్ళపూడి :** ఇంటర్ మీడియట్ చదివే వయసులో తీసుకునే నిర్ణయాలే ప్రతి విద్యార్థికి తమ జీవిత గమ్యాన్ని నిర్ణయించే సమయమని కరిబండి విద్యాసంస్థల జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ మురళి అన్నారు. తాళ్లపూడి లోని కరిబండి విద్యాసంస్థల ఆధ్వ ర్యంలో ఎన్‌జిఆర్ అండ్ ఎస్ఎస్‌కే ఇంటర్ కళాశాల విద్యార్థులు శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొదటి సంవత్సర విద్యార్థులకు సెకండ్ ఇయర్ విద్యార్థులు స్వాగతం పలికారు. ఈ సంద ర్భంగా డాన్స్ కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి మురళి, వైస్ ప్రిన్సిపాల్ మాధవరావు, అధ్యాపకులు పాపారావు, సత్య నారాయణ, రాజేష్, రాఘవేంద్ర, అమరేంద్ర, గీత, జ్యోతి, అరుణసాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు రక్తదాన శిబిరం

**విశాలాంధ్ర - సీతానగరం :** నేడు మండలంలో ఇనుగంటి వారిపేట గ్రామంలోని సత్యం సీతాపతి రావు కళ్యాణ మండపంలో ఆగస్టు 11వ తేదీ ఆదివారం మెగా రక్త దాన శిబిరం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మెగా అభిమానులు మాట్లాడుతూ మెగా స్టార్ చిరంజీవి గారి పుట్టినరోజు పురస్కరించుకొని ఆయినా చేస్తున్న సమాజ సేవలో మా వంతు సహాయంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నామని కావున పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు ఈ రక్తదాన శిబిరంలో పాలుపంచుకోవాలని కోరారు. ఒక నిండు ప్రాణాన్ని కాపాడే శక్తి మనకు భగవంతుడు రక్తదాన రూపంలో అందించాడని కావున ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా ప్రాణ దాతలుగా నిలవాలని కోరారు.

## కారు , ఆటో ఢీ

**విశాలాంధ్ర - గండేపల్లి :** గండేపల్లి మండలం జెడ్ రాగంపేట వద్ద ఆదిత్య హాస్పిటల్ ఎదురుగా రాజమండ్రి వైపు నుండి తుని వైపు వెళ్లే కారు అదే మార్గం గుండా వెళుతున్న ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు చిన్న చిన్న గాయాలు అయ్యాయి. వారు యల్లమిల్లి గ్రామానికి చెందిన మంగిన వీరబాబు, కొల్లి వెంకట్రావు అని పోలీసులు తెలిపారు. వారిని ప్రథమ చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు పంపించినట్టు పోలీసులు తెలిపారు.

## కొల్లి సూర్యారావు మరణం తీరనిలోటు

**విశాలాంధ్ర - అమలాపురం :** ఎమ్మార్పీస్ సీనియర్ నాయకుడు బిజెపి సీనియర్ నేత కొల్లి సూర్యారావు అకాల మరణం మాదిగ జాతికి తీరనిలోటని పలువురు నాయకులు కొనియాడారు. 2019 ఎన్నికలలో దీజీపీ పార్టీ తరపున పి గన్నవరం నియోజకవర్గం నుండి మీరాగా పోటీ చేసిన కొల్లి సూర్యారావు ప్రమాదానికి గురై కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఈ సందర్భంగా డా బాబా జగజ్జీవన్ రామ్ ఉద్యోగుల సంఘం సభ్యులు సూర్యారావు స్వగ్రామం పుల్లేటికుర్రులో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సూర్యారావు చిత్రపటానికి నివాళులు అర్పించారు. వారి సతీమణికి కొంత ఆర్థిక సహాయం అంద జేసారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యో గుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మడికి శ్రీరాములు, ఎబిసిసి మెంబర్ యార్లగడ్డ రవీంద్ర, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి తెన్నేటి రాజ బాబు, కార్యవర్గ సభ్యులు కె కృపాకర్, నెంద్రు వాడపల్లి పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి సహకరిస్తా యనమల రాజేష్

విశాలాంధ్ర - కాకినాడ : తొండంగి మండలం ఎ కొత్తపల్లి శ్రీ భువనేశ్వరి సహిత విజయేశ్వర స్వామి వార్ల కదంబ వనవాసిని సంస్థానం నందు నూతనంగా నిర్మించిన గోశాల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా యనమల రాజేష్, విశిష్ట అతిథిగా డా చప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ కొత్తపల్లి గ్రామంలో ఈ ఆలయం ఎంతో మహిమాన్వితమైన క్షేత్రం అని ఎటువంటి నిధులు లేకపోయినా ఇక్కడ ఆధ్యాత్మికంగా, నిత్యాన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండడం చాలా గొప్పవిషయం అన్నారు. ఆలయ అభివృద్ధికి ఎటువంటి సహాయం కావాలన్నా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం డా చప్పిడి మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన గోశాల అత్యద్భుతంగా ఉందని ఇక్కడ కాసేపు గడిపితే మనసు ఎంతో ప్రశాంతంగా ఉంటుందని అన్నారు. ఆలయ నిర్వాహకులు గంగాధర్ (భూమనంద భారతి) మాట్లాడుతూ ఈ ఆలయాన్ని ప్రముఖ పుణ్యక్షేత్రంగా కీర్తి దిద్దడమే తమ లక్ష్యం అని అన్నారు. గోవు మనకు అమ్మ వంటిదని గోవుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, గోమాతను అందరూ పూజించాలని అన్నారు. డా చప్పిడి కాపగంటి సతీష్ కుమార్, సతీమణి లక్ష్మి కళ్యాణి గోశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అతిథుల చేతులమీదుగా ప్రారంభించడం జరిగింది. అనంతరం ఆలయ అవసరాలకోసం కొనుగోలు చేసిన నూతన బొలెరో వాహనాన్ని యనమల రాజేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి ఆదిసూర్యనారాయణ, వనపర్తి రాజా ప్రసాద్, వనపర్తి రాజబాబు, పల్లా అప్పారావు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా గంగానమ్మ జాతర

విశాలాంధ్ర- విజయవాడ: ఏలూరు జిల్లా మండవల్లి మండలం భైరవపట్నం గ్రామ దేవత గంగానమ్మ జాతర అంగరంగ వైభవంగా జరుగుతోంది. తొలిరోజైన శుక్రవారం గ్రామ ఆడ పడుచులు చల్లనైవేద్యం సమర్పించి అమ్మకు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఊరేగిం పునకు బయలుదేరిన గంగానమ్మకు ప్రతి ఇంటా పాన్పువేసి పూజలు చేసి ఆశీర్వచనం పొందారు. తీన్మార్ వాయిద్యాలతో సంబరాన్ని హోరెత్తించారు. రెండోరోజు శనివారం వీధివీధి తిరు గుతూ అమ్మవారు భక్తులను ఆశీర్వదించారు. మాజీ సర్పంచ్ చదలవాడ శ్రీమన్నారాయణ, కమిటీ సభ్యులు పర్యవేక్షణలో యువత ఆద్యంతం తమదైన శైలిలో నృత్యం చేస్తూ చూపరులను కట్టిపడేశారు. ఆదివారంతో జాతర ముగుస్తుంది.

## మద్యం దుకాణం సేల్స్‌మెన్‌లను తొలగించొద్దు

విశాలాంధ్ర - తాళ్ళపూడి : అధికారంలోకి వచ్చిన ఎన్డీయే కూటమి కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని, చిరు ఉద్యోగులపై కూడా కక్ష సాధిస్తోందని రాష్ట్ర ఎస్సి సెల్ వైకాపా నాయకులు పిట్టా శ్రీను ఆరోపించారు. తాళ్ళపూడి మండలంలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేస్తున్న సేల్స్‌మెన్, సూపర్ వైజర్ ఉద్యోగులు అది వైసీపీ వర్గీయులపై జిల్లాలో మరెక్కడా లేని విధంగా వేటు వేస్తూ చర్యలు చేపట్టిందని అన్నారు. ఈ మేరకు తాళ్ళపూడి లో మద్యం దుకాణంలో పని చేస్తున్న సేల్స్‌మెన్‌లను తొలగించి, కొవ్వూరులో పని చేసే ముగ్గురిని నియమించినట్లు సంబంధిత ఎక్సైజ్ ఎస్సై లక్ష్మణ స్వామీ మౌఖిక ఆదేశాలు చెప్పారు. దీనితో అక్కడ పని చేస్తున్న సేల్స్‌మేన్లు అశోక చక్రవర్తి భాను ప్రసాద్, తమకింకా సెప్టెంబర్ వరకు ఉద్యోగం చేసే అగ్రిమెంట్ ఉందని, తమపై కక్ష తో పార్టేజీ ఉన్న కొవ్వూరు షాప్‌కి బదిలీ చేసి, ఇష్టం లేకుంటే రాజీనామా చేసేయమని బలవంతం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయం పై తాళ్లపూడి షాప్ లో ఉన్న ఎక్సైజ్ ఎస్.ఐ లక్ష్మణ స్వామి పై వారి ఆదేశాల ప్రకారం తాము పని చేయాల్సిఉందని అన్నారు. వైకాపా నాయకులు పిట్టా శ్రీను మాట్లాడుతూ, తాళ్లపూడి మండలం లో 4 షాప్ లలో 14 మంది పని చేస్తుండగా వీరిలో వైసీపీ వర్గీయులను మాత్రం తొలగించేందుకు చర్యలు తీసు కున్నారని, వీరితో పని చేసే టీడీపీ వర్గీయులను కొనసాగిస్తున్నారని ఇది ఎన్డీయే ప్రభుత్వం కొవ్వూరులో జరుపుతున్న కక్ష సాధింపు అని అన్నారు. తమ ప్రభుత్వం లో పార్టీ విభేదాలు లేవని అందుకే అర్హత ఉన్న వారు టీడీపీ వర్గీయులైనప్పటికి తమ ప్రభుత్వం లో ఉద్యోగాలు ఇచ్చామని, ఎన్డీయే కక్ష సాధింపు సహించమని హెచ్చరించారు. తొలగిస్తే మద్యం షాపుల్లో ఉద్యోగులందరినీ తొలగించాలని డిమాండ్ చేశారు.

## రామచంద్రరావు మృతికి సీపీఐ సంతాపం

విశాలాంధ్ర - రాజోలు : ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రామచంద్ర పురానికి చెందిన ఉమ్మడి రాష్ట్ర సిపిఐ రాష్ట్ర ఆఫీస్ సెక్రటరీ రామచంద్ర రావు మృతికి శనివారం సిపిఐ రాజోలు ఏరియా సమితి సంతాపం తెలిపింది. సిపిఐ నాయకులు మాట్లాడుతూ రాజోలు మండలం తాటిపాక లోని డాక్టర్ కదలి సత్యనారాయణ ఇంటి వద్ద ఇటీవల ఆయనను కలిసి మాట్లాడటం జరిగిందని, ఆయన ఎంతో ఆరోగ్యంగా చురుకుగా రెడ్ సెల్యూట్ కామ్రేడ్స్ అంటూ మమ్మల్ని పలకరించి పార్టీ గురించి పని విధానం గురించి, పార్టీకి యువకుల యొక్క ప్రాధాన్యత గురించి ఎన్నో విషయాలు ముచ్చటించారమని అన్నారు. ఇంతలోనే ఈ విషాద వార్త వినటం బాధాకరంగా ఉందని సంతాపం తెలియజేసిన నాయకులు అన్నారు. సంతాపం తెలియజేసిన వారిలో సీపీఐ రాజోలు నియోజకవర్గం కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్, చెల్లి బోయిన తాతా రావు, గెద్దం ప్రభాకర్ రావు, నల్లి బుజ్జి బాబు, కొండ సత్తిబాబు, పిచ్చుక గంగాధరరావు, పుల్లెల ఆనంద్, వై వెంకట్, మేడిచర్ల సత్యనారాయణ, సరెళ్ళ శివ, గోగి రామకృష్ణ, దీపాటి గంగాచలం తదితరులు ఉన్నారు.

## పర్యావరణాన్ని రక్షించుకునే బాధ్యత అందరిది...

విశాలాంధ్ర - కాకినాడ : పీపుల్స్ వరల్డ్ కమిషన్ ఆన్ డ్రాట్ అండ్ ఫ్లడ్ సంస్థ ఆధ్వర్యంలో కిరణ్ కంటి ఆసుపత్రి మీటింగ్ హాల్‌లో కాకినాడ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. సంస్థ వ్యవస్థాపకులు రామన్ మెగాసెసే అవార్డ్ గ్రహీత డాక్టర్ రాజేంద్ర సింగ్ జాతీయ కన్వీనర్ బొలిశెట్టి సత్య నారాయణ చేపట్టిన కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జరిగిన సమావేశానికి సంస్థ ప్రత్యేక సలహాదారు పద్మశ్రీ సంకురాత్రి చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. సంస్థ కో ఆర్డినేటర్ ప్రెసింగి ఆదినారాయణ సమావేశాన్ని నిర్వహించారు. తొలుతగా పర్యావరణ ప్రకృతి జీవ వైవిధ్యంపై వీడియో స్క్రీన్ పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ జరిగింది. భిన్నత్వం వైవిధ్యంతో కూడుకున్న ప్రకృతి ప్రతిఫలమే మానవ సమాజమని ప్రకృతిని భిన్నత్వంలో గల సమాజాన్ని ఆధునిక నాగరికత అభివృద్ధి పేరిట వినాశనం చేసుకోకుండా పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యత అందరిమీద వుందని డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ప్రధాన విషయాలను చర్చించారు. సామర్లకోట కాకినాడ కెనాల్ ప్రక్షాళన జరగాలని, మడ అడవుల విధ్వంసం ఆగాలని, ప్రాచీన వారసత్వ సంపద కట్టడాలను పరిరక్షించుకోవాలని, వరదలు ముంపు నివారణకు ముందస్తు ప్రణాళిక అవశ్యమని, తడి నేలలు ఆక్రమణకు గురికాకుండా చూసు కోవాలని, గ్రీనరీ పెంపు దలకు ప్రాధాన్యత వుండాలని, గార్బేజ్ డంపింగ్ యార్డ్ ప్రజల నివాసాలకు దూరంగా, వ్యవసాయ వినియోగం ప్రజా నివాసం లేని భూముల్లో ఆధునిక ఆదాయ ఉత్పత్తి కేంద్రాలుగా ఏర్పాటు కాబడాలని, వినాయక చవితి ఉత్సవాల్లో మట్టి విగ్రహాలు పూజించి పర్యావరణ హితం కోరాలని అజెండా అంశాలను అభిప్రాయ వేదికలో కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రతి నెల నిర్దిష్ట సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆదినారాయణ పేర్కొన్నారు. జిల్లా కమిటీ ప్రతినిధులు లక్కరాజు సత్యనారాయణ, దూసర్లపూడి రమణరాజు, ఎపిజె విను ఎన్ కిషోర్ కుమార్, చిట్ల కిరణ్ కుమార్, ఆలపాటి శ్రీనివాస్, చిలుకూరి రాంకుమార్, వక్కలంక రామకృష్ణ, నందమూరి వీర వెంకట వినోద్, కె మృత్యుంజయరావు, చిక్కాల సుబ్రహ్మణ్యం, వివియల్ ఎన్ మూర్తి, సీమకుర్తి సురేఖ పాల్గొన్నారు. ఎ శ్రీవాణి, జివి రావు, జి లోవరాజు తదితరులు పర్యవేక్షించారు.

## వీరేశ్వర అన్నదాన ట్రస్ట్‌కి విరాళం అందజేత

విశాలాంధ్ర - ముమ్మిడివరం, ఐ పోలవరం : నిత్యకళ్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ వీరేశ్వర స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కి భక్తుడు శనివారం విరాళం అందించారు. హైదరాబాద్‌కు చెందిన పట్టపు ప్రభాకరరావు దంపతులు శాశ్వత అన్నదాన పథకానికి రూ. 11000/ (పదకొండు వేలు)విరాళం ఆలయ పర్యవేక్షణాధికారి బి వీరభద్ర రావుకి అందజేశారు. ఈసందర్భంగా దాతలను, ఆలయ సహాయ కమీషనర్, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ అభి నందించారు. తొలుత వీరికి ఆల య అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్శనం అందించారు. అనంతరం స్వామి వారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు. నిత్యం స్వామి వారి ఆలయంలో రాత్రి కల్యాణానికి విచ్చేసే భక్తులకు శ్రీ వీరేశ్వర అన్న దాన ట్రస్ట్ ద్వారా నిత్యాన్నదాన పథకాన్ని దేవస్థానం ఏర్పాటు చేసింది. ప్రతిరోజూ వందల మంది భక్తులు నిత్యాన్నదానంలో పాల్గొంటూ ఉంటారు. ఈ సందర్భంగా కార్యనిర్వాహణాధికారి మాట్లాడుతూ శ్రీ వీరేశ్వర అన్నదాన ట్రస్ట్‌కి ఆదాయ పన్ను మినహాయింపు 80జి ఉందన్నారు. నిత్య, మాస, వార్షిక, అన్నదాన విరాళాలు కోసం aptemples.ap.gov.in, www.sriveereswqra swamy temple.com సంప్రదించాలని సూచించారు. భక్తులు అన్నదాన విరాళాలలో పాల్గొని ప్రోత్సహించాలని సూచించారు.

VASTU HOUSING FINANCE

వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

యూనిట్ 203 & 204, 2వ అంతస్తు, "ఏ" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ రోడ్, సెవ్రి (పశ్చిమ), ముంబై 400015. మహారాష్ట్ర. సిఐఎన్ నం.: U65922MH2005PLC272501

సెక్యూరిటైజేషన్ చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) కింద డిమాండ్ నోటీసు

వీహెచ్‌ఎఫ్‌సిఎల్ నుండి పొందిన పరపతి సౌకర్యాల యొక్క వడ్డీని చెల్లించడంలో మరియు అసలు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. అందుచేత సదరు పరపతి సౌకర్యాలు నిరర్థక ఆస్తులుగా మారాయని వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ముంబైలోని దాని ప్రధాన కార్యాలయం ద్వారా ఈ క్రింది రుణగ్రహీతలు / హామీదారులు / తనఖాదారులకు నోటీసు జారీ చేయడమైనది. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) కింద వారికి ఈ నోటీసులు జారీ చేయబడ్డాయి, అయితే అవి వారికి అందజేయబడక తిరిగి వచ్చినందున బహిరంగ నోటీసు మార్గంలో వారికి దీని గురించి తెలియజేయడమైనది.

| రుణగ్రహీత, సహ-రుణగ్రహీత పేరు మరియు లోన్ ఎక్కౌంట్ నం. | సెక్షన్ 13(2) కింద డిమాండ్ నోటీసు తేదీ మరియు బకాయి | తనఖాపెట్టబడిన ఆస్తి యొక్క వివరాలు |
|---|---|---|
| ఆర్. సురేష్ (రుణగ్రహీత) కొండమ్మ రుద్ర (సహ-రుణగ్రహీత), సంతోషి మాతా (సహ -రుణగ్రహీత), రుద్ర కొండయ్య (సహ-రుణగ్రహీత) రుద్ర కొండయ్య (సహ రుణగ్రహీత) LP0000000084267 HL0000000081866 | 20-జులై-24/ తదుపరి వడ్డీ మరియు దానిపై చార్జిలతో 15-జులై-24 నాటికి రూ.1363348/- & రూ.757976/- | పాత ఆర్.ఎస్.నం.15/7, కొత్త ఆర్.ఎస్.నం.15/7సి, సబ్ డివిజన్ 2-7/2, జీడిగుంట గ్రామం మరియు గ్రామ పంచాయతీ, నిడదవోలు సబ్ డివిజన్, జీడిగుంట, నిడదవోలు, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్, 534302, ఆస్తి విస్తీర్ణం: 290 చదరపు గజాలు. హద్దులు: ఉత్తరం: సూద అబ్బులు భూమి, దక్షిణం: రోడ్డు, తూర్పు: గ్రామ కంఠం, పడమర: రుద్ర రామారావు భూమి. |
| సురేష్ కోడి (రుణగ్రహీత) సుధ కోడి (సహ-రుణగ్రహీత), LP0000000038020 LP0000000065069 | 26-జులై-24/ తదుపరి వడ్డీ మరియు దానిపై చార్జిలతో 25-జులై-24 నాటికి రూ.2095764/- & రూ.502892/- | డి.నం.13-17/2-19, ఆర్.ఎస్.నం.161/17, అసెస్‌మెంట్ నెం.1078014078, నిడదవోలు, నిడదవోలు మున్సిపాలిటీ, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్, 534301, 120 చదరపు గజాల కొలత భూమి. హద్దులు: ఉత్తరం: మునిసిపల్ రోడ్, దక్షిణం: కొడమంచిలి వెంకటరావు ఇల్లు, తూర్పు: కోడి వెంకట్రావు ఇల్లు, పడమర: మున్సిపల్ రోడ్ |

నోటీసు సర్వీసుకు ప్రత్యామ్నాయంగా ఈ చర్యలు తీసుకోబడును. ఈ నోటీసును ప్రచురించిన తేదీ నుండి 60 రోజులలోపు మొత్తం బకాయిలు చెల్లించవలెనని పై రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు మరియు/లేదా వారి హామీదారులు (ఎక్కడైనా వర్తించే చోట)కు సూచించడమైనది. విఫలమైన పక్షంలో ఈ నోటీసు తేదీ నుంచి 60 రోజుల గడువు ముగిసిన తర్వాత సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం తదుపరి చర్యలు తీసుకోబడతాయి. దయచేసి పేర్కొన్న నోటీసు సెక్షన్ 13(13) ప్రకారం రుణగ్రహీతలకు/గ్యారంటీదారులకు/ తనఖా పెట్టిన ఆస్తిని విక్రయించరాదని/లీజుకు ఇవ్వకూడదని/బదిలీ చేయరాదని తెలియజేసిందని తెలియజేయండి.

చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం పైన పేర్కొన్న తనఖాపెట్టిన ఆస్తిని విక్రయించరాదని/లీజుకు ఇవ్వకూడదని/బదిలీ చేయరాదని రుణగ్రహీతలకు/ హామీదారులకు/ తనఖాదారులకు తెలియజేసినట్లు కూడా దయచేసి పేర్కొన్న నోటీసును భావించవలెను.

తేదీ: 11.08.2024
ప్రదేశము: పశ్చిమగోదావరి

అధీకృత అధికారి,
వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

## అందరూ ఆరోగ్యవంతమైన జీవనశైలిని ఆచరించాలి : వాసంశెట్టి సుభాష్

**విశాలాంధ్ర - రామచంద్రపురం :** ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవన శైలిని ఆచరించి సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని రాష్ట్ర కార్మిక శాఖ మాత్యులు వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక పట్టణము నందు కార్మిక శాఖ మంత్రివర్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాటాడుతూ, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, అనారోగ్యాల బారినపడిన వారు యొక్క వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని అనారోగ్య పరిస్థితులను చక్కదిద్దుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేని నిరుపేదలు, చిన్నారులకు సంబంధించి గుండె జబ్బులు, రక్తపోటు, డయాబెటిస్, రక్తహీనత, ఎముకల వ్యాధిగ్రస్తులు తదితర వైద్య చికిత్సలు నిర్వహించుకుని వైద్యులు సూచించిన ఔషధాలను ఉచితంగా పొంది సక్రమంగా వాడుతూ ఆరోగ్యకరమైన మెరుగైన జీవనాన్ని పొందాలన్నారు. చిన్నారులలో గుండె జబ్బులపై స్క్రీనింగ్ నిర్వహించి ఔషధాలు ఉచితంగా అందించారని వీరికి శాశ్వత ప్రాతిపదికన చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. ఈ వైద్య శిబిరంలో వివిధ విభాగాల వైద్య నిపుణులు, సాధారణ వైద్యులు, నర్సులు, ఉద్యోగులు, పాల్గొని వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## 12న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సమావేశం : బండి వెంకటేశ్వరరావు

**విశాలాంధ్ర - ఏలూరు:** ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బి కే యం యు) రాష్ట్ర సమితి సమావేశం ఈనెల 12న విజయవాడ౼లో జరుగుతుందని బికేఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 12 సోమవారం ఉదయం గం.10:30లకు విజయవాడ సిపిఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవనంలో సమావేశం ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా బికేఎంయు జాతీయ అధ్యక్షులు పెరియా స్వామి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుండి 8 మంది బీకేఎంయు రాష్ట్ర సమితి సభ్యులు సమావేశానికి హాజరవుతున్నట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. సమావేశంలో ఇటీవల ఢిల్లీలో జరిగిన బికేఎంయు జాతీయ కార్యవర్గ సమావేశం నిర్ణయాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించనున్నట్టు తెలిపారు.

## వనమహోత్సవానికి ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్ షాన్ మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లాలో మొక్కలను విరివిగా పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న వనమహోత్సవ కార్యక్రమానికి అనువైన ప్రాంతాలను జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. తొలుత కాకినాడ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల, జేఎన్టీయూ గ్రౌండ్, జిల్లా క్రీడా మైదానాన్ని పరిశీలించారు. అదేవిధంగా కాకినాడ పోర్టు ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం కాకినాడ పోర్టు ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న చెక్ పోస్ట్ ప్రాంతాన్ని పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో జేఎన్టీయూ వైస్ ఛాన్సలర్ కేవీఎస్జీ మురళీ కృష్ణ, రిజిస్టర్ రవీంద్రనాథ్, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, కాకినాడ పోర్ట్ అధికారి కె ధర్మశాస్త్ర, అటవీ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రామచంద్రరావు మృతి సీపీఐకి తీరని లోటు

**విశాలాంధ్ర - ఏలూరు :** సీపీఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్ లో సుదీర్ఘకాలం ఆఫీస్ కార్యదర్శిగా పనిచేసిన రామచంద్రరావు మృతి సీపీఐకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. రామచంద్రరావు ఆఫీసు కార్యదర్శిగా అనేక సేవలు అందించారని కొనియాడారు. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసి అందరికీ ఆదర్శనీయంగా నిలిచారని తెలిపారు. పార్టీ సమావేశాలు, సైద్ధాంతిక, రాజకీయ శిక్షణ తరగతులు జరిగినప్పుడు సమన్వయంతో పనిచేసి విజయవంతంగా జరిగేటట్లు కృషి చేసే వారిని తెలిపారు. రామచంద్ర రావు మృతికి కుటుంబ సభ్యులకు, ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు.

**సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు సంతాపం**

**భీమవరం:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్ కార్యాలయం కార్యదర్శిగా సుదీర్ఘ కాలం పనిచేసిన రామచంద్రరావు మృతికి సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా సమితి తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసింది. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ రామచంద్రరావు సీపీఐ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శిగా ఐదు దశాబ్దాలకు పైగా వెలకట్టలేని సేవలందించా రన్నారు. పార్టీ పట్ల ఆయనకు వున్న నిబద్ధత, అంకితభావం అందరికీ ఆదర్శనీయమన్నారు. రామచంద్రరావు మృతి పార్టీకి తీరని లోటుగా పేర్కొంటూ నివాళులర్పించారు. రామచంద్రరావు మృతికి సంతాపం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

## నర్సింగ్ వృత్తి విలువైనది

**విశాలాంధ్ర - గోపాలపురం :** రోగుల పట్ల ప్రేమాభిమానాలు చూపించి బ్రతికించాలని మాజీ హోంమంత్రి తానేటి వనిత తెలిపారు. శనివారం స్థానిక కొండవీటి స్కూల్ ఆఫ్ నర్సింగ్ ఇన్స్టిట్యూట్ నందు సెకండ్ బ్యాచ్ నర్సింగ్ విద్యార్థులకు క్యాపింగ్, పిన్నింగ్, మరియు క్యాండిల్ శరమని కార్యక్రమం సంస్థ కస్పాండెంట్ కే ఎస్ డి ఆశీర్వాదం అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ రోగులకు సేవ చేయాలి అనే సదుద్దేశంతో ఎంచుకున్న ఈ వృత్తి పట్ల సహనం ప్రేమానురాగాలు కలిగి ఉండి రోగులను సైతం కుటుంబసభ్యులుగా భావించి వైద్య సేవలు అలందించాలని కోరారు. మదర్ తెరిసాను ఆదర్శంగా తీసుకొని విద్యలో రాణించి అనంతరం మీరు సేవలందించే చోట పలువురు మన్ననలు పొందాలని తెలిపారు. నర్సింగ్ విద్యార్థులకు క్యాపిం కార్యక్రమం ఆమె నిర్వహించారు. అనంతరం స్వర్గీయ కొండవీటి సంజీవరావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతన అంబులెన్స్ ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఆశీర్వాదం మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థమై రోగులకు ఉచిత అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేశామని, పరిసర ప్రాంతాల ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజమండ్రి పరిధి వరకు డీజిల్ ఖర్చులతో సహా భరించి అంబులెన్స్ సేవలు అందిస్తామన్నారు. అనంతరం కంప్యూటర్ ల్యాబ్ ను కూడా కొవ్వూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ జడ్పిటిసి సభ్యురాలు కాకులుపాటి లలిత, వైకాపా సీనియర్ లీడర్ వెలగా శ్రీరామ్మూర్తి, నర్సింగ్ ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపాల్ సిహెచ్ అనూష, కొండవీటి కళాశాల ప్రిన్సిపాల్ పి సంపత్ కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది నర్సింగ్, కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవు : ఎస్పీ కిషోర్

**ఏలూరు జిల్లాలో కోర్టు మానిటరింగ్ సిస్టం ఏర్పాటు చేస్తాం**

**విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు :** జిల్లాలోని పోలీసులు విధి నిర్వహణలో ఎవరైనా అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ప శివ కిషోర్ స్పష్టం హెచ్చరించారు. ఏలూరు జిల్లాలో త్వరలో నూతన కోర్టు మానిటరింగ్ సిస్టం ఏర్పాటు చేయనున్నట్లు చేశారు. అలాగే విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన కోర్టు కానిస్టేబుల్ లకు నగదు మరియు ప్రశంసా పత్రంతో సత్కరిస్తామన్నారు. ఈ మేరకు శనివారం ఏలూరులోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న కోర్టు కానిస్టేబుల్ తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కోర్ట్ మానిటరింగ్ సెల్ ద్వారా కోర్టులో జరిగే అన్ని విచారణలపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందన్నారు. బాధితులకు న్యాయం జరిగే నేరం చేసిన వ్యక్తికి శిక్ష పడే విధంగా ఈ కోర్టు మానిటరింగ్ సిస్టం సిబ్బంది న్యాయస్థానానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తారని స్పష్టం చేశారు. ఎఫ్ఐఆర్ నమోదనంతరం కోర్టులో చార్జి సీటు దాఖలు చేసి ముద్దాయికి శిక్షపడే వరకు కోర్టు కానిస్టేబుల్ ముఖ్యపాత్ర పోషించాల్సి ఉంటుందని ఎస్పీ సూచించారు. అదేవిధంగా అధికారులు కేసు నమోదు చేసిన వెంటనే ఆయా కేసుల్లో దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఏలూరు జిల్లాలో ఎవరైనా నేరస్థుడు నేరం చేయాలంటే వెన్నులో వణుకు పుట్టే విధముగా కోర్టుల్లో ముద్దాయిలకు శిక్షలు పడేందుకు కోర్టు కానిస్టేబుల్ విధి నిర్వహణ చేయాలన్నారు. ఒక ముద్దాయి శిక్ష నుంచి తప్పించు కుంటే అది సమాజానికి చెడు చేస్తుందనే విషయాన్ని పోలీసులు గుర్తించాలన్నారు. కోర్టులో జరిగిన రోజువారి కార్యక్రమాలను డాక్యుమెంట్ రూపంలో ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు తెలియజేయాలని ఎస్పీ కిషోర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిసిఆర్బి సిఐ సుబ్బారావు, ఎస్బి సిఐ మల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహంపై దాడి రాజ్యాంగ విరుద్ధం

**విశాలాంధ్ర - భీమవరం టౌన్:** విజయవాడలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయటం రాజ్యాంగ విరుద్ధ మని, అటువంటి వారిని ఉపేక్షించకూడదని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోసిన రాజు అన్నారు. శనివారం గునుపూడిలోని తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, అపర మేధావి, దళిత ఆశ జ్యోతి, దేశానికే ఒక దిక్సూచి అయిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, శృతి వనం దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుంది అన్నారు. అటువంటి శృతి వనంలో అల్లరి మూకలు ప్రవేశించి, విగ్రహాన్ని పాడు చేయటం ఉపేక్షించ దగ్గ విషయం కాదని, దీనిపై వెంటనే సీఎం చంద్రబాబు నాయుడు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. దేశ నాయకుల విగ్రహాలపై దాడి చేసే వారిని అరికట్టాలన్నారు.

## అమ్మవార్లకు చీర, సారె సమర్పించిన జ్యోతుల లక్ష్మి

**విశాలాంధ్ర - జగ్గంపేట :** నియోజకవర్గ ప్రజలకు తమ కుటుంబం ఎప్పుడు రుణపడి ఉంటుందని కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ సతీమణి జ్యోతుల లక్ష్మీ దేవి అన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలోని అమ్మవార్లకు మొక్కు తీర్చుకునే కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని రామవరం గ్రామ పలు ఆలయాలను సందర్శించి అమ్మవార్లకు చీర, జాకెట్టు, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించారు. ఈ సందర్భంగా తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు స్వగృహంలో లక్ష్మీదేవి మీడియాతో మాట్లాడుతూ ప్రజలు అఖండ మెజారిటీతో తన మావయ్య జ్యోతుల నెహ్రూను ఎమ్మెల్యేగా గెలిపించిన సందర్భంగా తాను ఎన్నికల్లో మొక్కుకున్న మొక్కులు చెల్లించుకుంటున్నానన్నారు.

## దాతల సాయం అభినందనీయం

**విశాలాంధ్ర -భీమవరం:** ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవత్వమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. 37వ వార్డు రజకపేటకు చెందిన పాలచి తాతారావుకు వైద్య సదుపాయం నిమిత్తం ప్రశాంత్ టీమ్ హెల్పింగ్ హెడ్స్ ద్వారా రూ 10 వేలు ఆర్థిక సహాయం శనివారం ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాతలందిస్తున్న సహకారం వెలకట్టలేదని దాతలను అభినందించారు. కార్యక్రమంలో 37వ వార్డు జనసేన యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## ఐజక్ బాబు పుట్టిన రోజు వేడుక

**విశాలాంధ్ర -భీమవరం:** టీడీపీ సీనియర్ నాయకులు మైలబత్తుల ఐజక్ బాబు జన్మదిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కోశాధికారిధి మెంటే పార్థసారధి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మెంటే మాట్లాడుతూ ఐజక్ బాబు మరిన్ని పుట్టిన రోజులు జరుపుకుని పార్టీకి, ప్రజలకు సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో మద్దుల రాము, గంట త్రిమూర్తులు, ఎలమంచిలి శ్రీను, పతివాడ హరి, చెల్లబోయిన గోవిందు, శ్యాంబాబు, విజ్జురోతి రాఘవులు, హరి, పాల శ్రీరామదాసు, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ విష్ణులో గ్రాడ్యుయేషన్ డే

**విశాలాంధ్ర -భీమవరం:** శ్రీవిష్ణు మహిళా ఇంజినీరింగ్ కళాశాల 7వ గ్రాడ్యుయేషన్ డే శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్-చైర్మన్, ఆర్.రవిచంద్రన్, కార్యదర్శి ఆదిత్య విస్సమ్ మాట్లాడుతూ కేవలం ఉద్యోగాలపైనే దృష్టి పెట్టకుండా మంచి పారిశ్రామికవేత్తగా ఎదిగే ఉన్నత ఆలోచనలను కలిగి ఉండాలని సూచించారు. ప్రపంచం చాలా విస్తారమైనదని అనేక అవకాశాలను అందిస్తుందని, విద్యార్థులు వినూత్న ఆలోచనలతో అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రస్తుతం పారిశ్రామికాభివృద్ధి వేగంగా జరుగుతుందని, కనుక అందివచ్చిన అవకాశాలను చేజిక్కించుకొని, విజయవంతమైన పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అడ్మిన్ డాక్టర్ పి.శ్రీనివాసరాజు, వైస్-ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.వెంకటరామరాజు, డీన్స్, వివిధ విభాగాధిపతులు, 2020-24 బ్యాచ్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు, 2022-24 బ్యాచ్ ఎం.టెక్. ఎం.బి.ఏ. విద్యార్థినులు పాల్గొన్నారు.

# రోడ్లు అధ్వానం

**విశాలాంధ్ర-దేవరపల్లి:** దేవరపల్లి మండలంలోని రోడ్లు అధ్వానంగా వుండడంతో ప్రజల బాధలు వర్ణణాతీతంగా మారాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకువర్షాలకు రోడ్లు పెద్ద పెద్దగోతులతో దర్శనం యిస్తున్నాయి. మండలంలో ప్రధానంగా మండల కేంద్రమైన దేవరపల్లి రావాలంటే ప్రజలు రైతులు, వాహనదారులు ప్రజలు ప్రజాప్రతినిధులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. అయినా రోడ్లను పట్టించుకునే నాధుడు లేరని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు అందించిన ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు. నిత్యం ఈ రోడ్డులపై విద్యార్థులు దేవరపల్లి రావాలంటే ఎన్నో అవస్థలు పడవలసిందే అలాగే మండలంలోని కురుకురు గ్రామం ప్రజలు వాహన దారులు మండల కేంద్రానికి దేవరపల్లి ప్రభుత్వ కార్యాలయాలకు, ఆసుపత్రులు రావాలన్న ఎన్నో ఇబ్బందులు పడవలసిందే. ఆ రోడ్డు సమస్య పరిష్కరించమని సంవత్సరాలుగా ప్రజాప్రతినిధులకు అధికారులకు వివరించిన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా వుందన్నారు. అలాగే ఎర్నగూడెంగూడెం నుంచి త్యాజంపూడిగ్రామానికి వెళ్లాలంటే వాహనదారులకు కత్తి మీద స్వాములగా వుంది. జనసేన గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జ్ సువర్ణ రాజు జన సైనికులు త్యాజంపూ డి నుండి యాదవులు ఆరుపాటి దెబ్బలు వరకు పాదయాత్ర చేశారు అయినా గత ప్రభుత్వం ఆ రోడ్డు గురించి పట్టించుకునే దాఖలాలు లేవు కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఈ రోడ్డుకి మోక్షం కల్పించాలని నూతనంగా ఎన్నికైన గోపాలపురం నియోజకవర్గ కూటమి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజుకు ఆ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆ గ్రామస్తులు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ సువర్ణ రాజుకి వివరించారు. ఈ రోడ్డుకి తక్షణమే తాత్కాలిక మరమ్మతులు చేపట్టి శాశ్వత పరిష్కారం చేయడానికి కృషి చేయడం జరుగుతుందని ఆరు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. అలాగే పోలవరం కుడి కాలువ బ్రిడ్జి వద్ద రెండువైపుల మట్టి కొట్టుకుపోతుంది రాత్రి సమయాల్లో వాహనదారులు ప్రయాణించాలంటే అనేక ఇబ్బందుల ఆదమరిస్తే కాలువలోకి వెళ్ళటం ఖాయం ఎప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి మండలంలో రోడ్లకు మోక్షం కల్పించాలని మనలోని ప్రజలు వాహనదారులు కోరుచున్నారు.

## ఆత్మబంధువు సంఘం సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే

**విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం :** ఆపన్నులను ఆదుకోవడం మన ధర్మంగా భావించి ఆత్మబంధువుల సేవా సంఘం ఆధ్వర్యంలో వరద బాధితులకు సాయం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పోలవరం నియోజకవర్గంలోని వేలేరుపాడు మండలంలో వరద బాధితుల సహాయార్థం తాడేపల్లిగూడెంకి చెందిన ఆత్మబంధువుల సేవా సంఘం ఆధ్వర్యంలో సేకరించిన వస్తువులను బాధితులకు అందించే వాహనాన్ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు ఏ ప్రాంతం వారైనా ఆపదలో ఉంటే మనం ఆదరించాలని సూచించారు. వరద బాధితులకు అండగా నిలిచిన ఆత్మబంధుల సేవా సంఘం సభ్యులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మబంధువుల సేవా సంఘం సభ్యులు నిర్వాహకులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం పథకంతో టెక్నాలజీ అప్ గ్రేడేషన్

**విశాలాంధ్ర-భీమవరం:** సారూప్య పరిశ్రమలు వాటికి అవే సొంతంగా ఆదునిక యంత్రాలు సమకూర్చుకోలేని సందర్భంలో అన్నీ కలిసి ప్రత్యేక ప్రయోజన సమాఖ్య ఉమ్మడిగా ఏర్పడి క్లస్టర్ డెవలప్మెంట్ పథకములో టెక్నాలజీ అప్ గ్రేడెషన్ యంత్రాలు సమ కూర్చుకోవడానికి అవకాశము కలదని ఈ అవకాశాన్ని పరిశ్రమల యాజమాన్యం సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఒకే రకమైన కార్యకలాపాలు నిర్వహిస్తూ దగ్గర దగ్గరగా సుమారు 10, 15 పరిశ్రమలు వున్న చోట అందరికీ ఉపయోగపడేలా క్లస్టర్ డెవలప్మెంట్ ద్వారా కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుతో ప్రయోజనం పొందుటకు, రూ.5 నుంచి రూ.10కోట్ల వరకు ప్రాజెక్టు విలువ కలిగిన పరిశ్రమలకు కేంద్ర ప్రభుత్వ గ్రాంట్ 70 శాతం, రాష్ట్ర ప్రభుత్వ గ్రాంటు 20 శాతం, పరిశ్రమల యాజమాన్యం స్పెషల్ పర్పస్ వెహికల్ వాటా 10 శాతంతో, రూ. 10 నుంచి రూ.30 కోట్లు ప్రాజెక్టు విలువ కలిగిన పరిశ్రమలకు కేంద్ర ప్రభుత్వ గ్రాంటు 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వ గ్రాంటు 20 శాతం, పరిశ్రమల యాజమాన్యం స్పెషల్ పర్పస్ వెహికల్ వాటా 20 శాతంతో కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని పరిశ్ర మల యాజమాన్యాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ విషయాలపై అవగాహన కలిగించేందుకు పరిశ్రమల ప్రతినిధులతో ఈనెల 13న మధ్యాహ్నం గం.3లకు కలెక్టరేట్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరిశ్రమల యజమానులు, వారి ప్రతినిధులు తప్పక హజరు కావలని తెలిపారు. సమాచారంకు జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు సెల్ నెంబర్. 9959256522ను సంప్రదించాలన్నారు.

## పితాని సూర్యనారాయణకు మంత్రి నిమ్మల రామానాయుడు నివాళి

**విశాలాంధ్ర - పోడూరు:** ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సోదరులు పెనుగొండ ఎస్వీకేపీ కళాశాల చైర్మన్, ప్రముఖ అంతర్జాతీయ లేస్ వ్యాపారి పితాని సూర్యనారాయణ నాలుగు రోజుల క్రితం మృతి చెందారు. ఈ సందర్భంగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టరు నిమ్మల రామానాయుడు శనివారం కొమ్ముచిక్కాల వెళ్లి మాజీమంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణను పరామర్శించారు. దివంగతులైన పితాని సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నియోజకవర్గ టీడీపీ నాయకులు పెచ్చెట్టి పెదబాబు గండేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు ఫాగింగ్

**విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు:** దయేరియా క్యాంపెయిన్ ప్రోగ్రాంలో భాగంగా ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య(చంటి) వారి ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధులు రాకుండా మలేరియా విభాగం వారితో 27వ డివిజన్‌లోని చోదిమెళ్ళ, పెద్ద మాలపల్లి, చిన్న మాలపల్లి, కాపుల బజారు, గౌడ్ బజార్, తదితర ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూనలకు స్ప్రేయింగ్, మురుగు కాలువ కల్వర్టు కింద ఫాగింగ్, ఖాళీ స్థలలోఉన్న నిలవనీటిలో ఆయిల్ బాల్స్ వేయడం జరిగిందని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా .మాలతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో నాయకులు యడ్లపల్లి శివ, మలేరియా ఇన్స్పెక్టర్ దత్తి వేణుగోపాల్ స్వామి , మలేరియా మేస్త్రి డి. దుర్గారావు, శానిటరీ ఇన్స్పెక్టర్ సోమేశ్వరరావు, ఆరోగ్య కార్య దర్శి, ఆశా కార్యకర్తలు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## జయలక్ష్మికి సన్మానం

**విశాలాంధ్ర- ఉంగుటూరు :** ఉంగుటూరు జడ్పీటీసీ జయలక్ష్మి శ్రీనివాస్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జడ్పీటీసీ ఛాంబర్ ఉపాధ్యక్షురాలిగా ఎంపికయ్యారు. ఉంగుటూరు మండల ఎంపీటీసీ ఛాంబర్ అధ్యక్షులు బండారు నాగరాజు ఆధ్వర్యంలో జయలక్ష్మి శ్రీనివాస్ దంపతులను కైకరం గ్రామంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీటీసీలు పేడ అప్పన్న, మహాలక్ష్మి దానయ్య, తదితరులు పాల్గొన్నారు.

## యూటిఎఫ్ పతాకావిష్కరణ

**విశాలాంధ్ర - కొయ్యలగూడెం :** మండల కేంద్రమైన యుటిఎఫ్ సొసైటీ భవనం వద్ద స్వర్ణోత్సవ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని శనివారం ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఆకుమర్తి విక్టర్ యుటిఎఫ్ జెండా ఎగురవేసి యూనియన్ సేవా కార్యక్రమాలను వివరిం చారు. ప్రధాన కార్యదర్శి సరంగుల రమేష్ బాబు, బి.వి రావు, మరపట్ల. ఈశ్వర్, రాయపూడి. వెంకటరమణ, అలెగ్జాండర్, నాగకృష్ణ, పాలేటి శ్రీనివాస్,అనిల్, పాండురంగ, రఫీ, లక్ష్మీప్రసాద్, సుబ్బారావు, వరప్రసాద్ పాల్గొన్నారు.

## ఆజాద్ కా అమృత్ ప్రారంభం

విశాలాంధ్ర- చాగల్లు: తూర్పుగోదావరి జిల్లా స్థానిక చాగల్లు గ్రామంలో శనివారం నాడు ఆజాద్ కా అమృత్ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి బుజ్జి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలు సక్రమ అమలులో భాగంగా గ్రామపంచాయతీలో రక్షిత మంచినీటి సరఫరా నిర్వహణలోని మంచినీటి బోరు పాయింట్లను పరిశీలించడం జరిగినదని. ఆజాద్ కా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా చాగల్లు గ్రామపంచాయతీ వద్ద నుండి మెయిన్ సెంటర్ వరకు జాతీయ సమైక్యత ఉట్టిపడే విధంగా ర్యాలీ నిర్వహిం చడమైనదని తెలిపారు. ఈ సందర్భంగా త్రివర్ణ పతాకం ప్రతి ఇంటి పైన ఎగురవేయాలని, గ్రామస్థాయిలో వివిధ ప్రభుత్వ సంస్థల సిబ్బంది, ప్రజలు, ప్రజా ప్రతినిధులు, ఈ కార్యక్రమంలో సంకటితం చేయవలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు,, కార్యదర్శులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొనియున్నారు.

## ప్రతిఒక్కరిలో దేశ భక్తి పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర - రాజానగరం : ప్రతిఒక్కరిలో దేశ భక్తి పెంపొందించుకోవాలని హై స్కూల్ ఎస్ఎంసీ సభ్యులు సోడసాని త్రిమూర్తులు, పేపకాయల నాగేశ్వరావు అన్నారు. అజాది కా అమృత మహోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని చక్రద్వారబంధం గ్రామంలో గ్రామ సెక్రెటరీ శ్రీనివాసరావు అధ్యక్షతన జాతీయ పతాకాలతో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశం స్వతంత్రం కోసం తమ ప్రాణాలు సైతం త్రుణప్రాయంగా విడిచిన మహనీయులను విద్యార్థులు స్మరించుకోవాలి పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా గ్రామంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించి, దేశభక్తి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ప్రధానోపాధ్యా యులు జివివి సీతారామయ్య, జనసేన గ్రామ కమిటి అధ్యక్షులు ఆనందాల గోవింద్, నాయకులు కురుమాళ్ళ మహేష్, పేపకాయల నాగేశ్వరావు,మడబోయిన శ్రీను, సోడసాని శ్రీనివాసరావు, పేపకాయల సూర్యనారాయణ, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ అఫిషియల్ ఫేజ్‌లో ప్రసాద్‌కు స్థానం

విశాలాంధ్ర - తాళ్లరేవు : జనసేన పార్టీ అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కార్యకర్తల కుటుంబానికి భరోసా కల్పించడం కోసం దేశంలో ఏ నాయకుడూ చేయని ప్రయత్నంలో భాగంగా కార్యకర్తకు క్రియాశీల మెంబర్ షిప్ చేసుకోవడానికి రాష్ట్ర వ్యాప్తంగా రెండు వారాలు గడువు ఇవ్వడం జరిగింది. ఆ సమయంలో రాష్ట్రంలో 14 లక్షలు పైనే క్రియాశీల మెంబర్‌షిప్ పూర్తి చేయడం జరిగింది. ముమ్మిడివరం నియోజక వర్గంలో 11 వేల 671 క్రియాశీల మెంబర్‌షిప్ వాలంటీర్లు ద్వారా చేయడం జరిగింది. సుమారు ప్రతీ మండలానికి 15 మంది క్రియా శీల మెంబర్షిప్ వాలం టీర్లు ఈ మెంబర్షిప్ చేయడం జరిగింది. తాళ్లరేవు మం దలంలో 3 వేలు వరకూ క్రియాశీలక మెంబర్షిప్ తీసుకోవడం విశేషం. ముమ్మిడివరం నియోజక వర్గంలో 500 క్రియా శీలక మెంబర్షిప్ పూర్తి చేసిన ముగ్గురు క్రియవల్లెంటర్స్‌ని పార్టీ అఫిషియల్ ఫేజ్‌లో స్థానం దక్కగా తాళ్లరేవు మండలం నుంచి అధిక సంఖ్యలో 517క్రియాశీలక సభ్యత్వాలు చేయించిన వేగి రుద్ర నాగ భైరవ ప్రసాద్ అనే నాకు పార్టీ అఫిషియల్ ఫేజ్‌లో స్థానం కల్పించడం ఆనంద దాయకమన్నారు.

# బాధిత కుటుంబాలను పొన్నాడ పరామర్శ

విశాలాంధ్ర - తాళ్లరేవు : తాళ్ళరేవు మండలంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను ముమ్మిడివరం నియోజవర్గం మాజీ శాసనసభ్యులు పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పరామర్శించారు. తొలిత పటవల, అనంతరం కోరంగి గ్రామాలలో అయిన పర్యటించారు. ముమ్మిడివరం నియోజవర్గం తాళ్ళమండలంలో పటవల గ్రామంలో మాజీ శాసనసభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడు పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ముందుగా పటవల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కొటికలపూడి సూర్యకాంతం కుటుంబసభ్యులను, దంగేటి అప్పారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పాత కోరంగి గ్రామంలో నామాడి అబ్బాయి కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఓదార్చారు. ఆయా కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని ధైర్యానిచ్చారు. ఈకార్యక్రమంలో కాట్రేనికొన జిల్లా పరిషత్ సభ్యులు నేల కిషోర్, దొరబాబులతో పాటు స్థానిక నాయకులు, కళా వెంకటరమణ, కొప్పిశెట్టి వెంకట్, కొటికలపూడి చందు, చక్కపల్లి లక్ష్మణ్, నేల శ్రీను, నరాల శ్రీనివాస్, కడియాల కృష్ణ, ఊబా కామేశ్వరరావు, ముర్రే అన్నవరం, మేకల రాము, పోతుల రత్నకుమారి, వేగేశ్న రామరాజు, దడాల పండు, వెంటపల్లి వెంకటరమణ, శివ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రమౌళికి నేతల నివాళి

విశాలాంధ్ర - తాళ్ళరేవు : తాళ్లరేవు మండలం కోరంగి గ్రామానికి చెందిన చంద్రమౌళి అకాల మృతి చెందడంతో చంద్రమౌళికి టీడీపీ నాయకులు నివాళు లర్పించారు. కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం కోరంగి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వెంటపల్లి చంద్రమౌళి సంతాప సభ పాత కోరంగి గ్రామంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, దళిత యునైటెడ్ వెల్ఫేర్ సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రమౌళి పార్టీ, సంఘ పరంగా చేసిన పనులు గుర్తుకు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ (బాబి), మందాల గంగ సూర్యనారాయణ, టేకుమూడి లక్ష్మణరావు, వాడ్రేవు వీరబాబు, జక్కల ప్రసాద్, రోళ్ళ శ్రీనివాస చక్రవర్తి, వాకపల్లి చిరంజీవి, దున్నా సుబ్రహ్మణ్యం, చంద్రాల బుజ్జి, గంజా సూరిబాబు, పిల్లి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## జీర్ణించుకోలేకే జగన్మోహన్‌రెడ్డి పేరు తొలగింపు

విశాలాంధ్ర - కొవ్వూరు : ఎంతో ప్రతిష్టాత్మకంగా అమరావతిలో నిర్మించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు కన్నా జగన్మోహన్ రెడ్డి పేరు పెద్దగా రాయడంతో దానిని దళితులు జీర్ణించుకోలేక జగన్మోహన్‌రెడ్డి పేరును తీసివేశారు. తప్ప అంబేద్కర్ పేరును ఆ శిలాఫలకాలను ఏమీ చేయలేదని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. అంబేద్కర్ యొక్క విదేశీ విద్య పేరును మార్చివేసి ఎస్సీలకున్న 27 పథకాలను రద్దు చేసిన ఘనుడు జగన్మోహన్ రెడ్డి. ఆంధ్రప్రదేశ్లో అంబేద్కర్ రాజ్యాంగం మానేసి రాజారెడ్డి రాజ్యాంగంగా మార్చి, ఎస్సీ ఎస్టీల 40 వేల కోట్లను దారిమళ్లించిన ప్రభుద్ధుడు జగన్మోహన్ రెడ్డి. అసలు అంబేద్కర్ విగ్రహాన్ని పట్టుకునే అర్హత జగన్‌కు, వైఎస్ఆర్సిపి ప్రతినిధులకు లేదని ముప్పిడి వెంకటేశ్వరరావు ఘాటు విమర్శలు చేశారు. ఈ కార్యక్రమంలో మద్దిపాటి శివరామకృష్ణ, ఆళ్ల నాని, మద్దిపాటి సురేష్ మరియు తదితరులు పాల్గొన్నారు

## జనసంద్రంగా వాడపల్లి దివ్య క్షేత్రం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని వాడపల్లి గ్రామంలోని స్వామివారి గోవింద స్వరాలతో మార్మోగిన చందన వెంకన్న క్షేత్రం కోనసీమ తిరుమల తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన శ్రీ కలియుగ వెంకటేశ్వరస్వామి అలివేలు మంగ పద్మావతి సమేతంగా కొలువై ఉన్న వాడపల్లి క్షేత్రానికి వేలాదిగా భక్తులు తరలివస్తున్నారు. ఏడువారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం అనే నానుడితో రాష్ట్ర నలుదిక్కుల నుండి భక్తులు తరలివచ్చి ఏడువారాల వెంకన్నను దర్శించుకున్న దివ్య ఆశీస్సులు పొందుతున్నారు. శనివారం తెల్లవారు జామున గౌతమీ గోదావరిలో తల స్నానాలను ఆచరించి, మొక్కుబడులు చెల్లించుకునే భక్తులు తలనీలాలు స్వామి వారికి సమర్పించుకుని సంప్రదాయ వస్త్రధారణలతో స్వామివారి ఆలయ మాడవీధుల్లో ఏడు ప్రతిక్షణాలు నిర్వహిస్తూ గోవిందా గోవిందా హరి గోవిందా, అనే నామస్వారాలతో ఆలయమంతా మారుమోగినది. స్వామివారి ఆలయ సన్నిధిలో ఐశ్వర్య లక్ష్మీ హోమం అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా తగు ఏర్పాటు చేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ బి కిషోర్ కుమార్ తెలిపారు. శనివారం ఒక రోజే మొత్తం రూ.32,48,304 మధ్యాహ్నం మూడు గంటల వరకు వచ్చిన ఆదాయం. ఆలయ కార్యనిర్వాహణ అధికారి బి కిషోర్ కుమార్ తెలిపారు.

## 12న పీజీఆర్ఎస్ : కలెక్టర్

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లా స్థాయిలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం కాకినాడ కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ హాలులో ఈ నెల 12న ఉదయం 10 గంటల నుంచి 1:00 వరకు నిర్వహించడం జరుగుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆదేశించారు. అదేవిధంగా రెవెన్యూ డివిజన్, మండల స్థాయిలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం అన్ని మండలాల్లో సోమవారం ఉదయం 10:00 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు హాజరుకావాలన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలకు యూటీఎఫ్ పరిష్కారం

విశాలాంధ్ర - కరప : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పడి ఇప్పటికీ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల కేంద్రం కరప మండల విద్యాశాఖాధికారి కార్యాలయం సమీపంలో యూటీఎఫ్ జెండాను జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఐ ప్రసాదరావు ఆవిష్కరించారు. సీనియర్ కార్యకర్త రామకృష్ణ సందేశం ఇస్తూ అనేక పోరాటాల ద్వారా ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేందుకు యూటీఎఫ్ గత యాభై ఏళ్లుగా ఎంతో కృషి చేసిందన్నారు. ఐ.ప్రసాదరావు మాట్లాడుతూ 117 జీవోను తక్షణమే రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలకు జీవం పోయాలని కోరారు. సీపీయస్‌ను రద్దు చేయాలని ఆలీం కోరారు. ఉద్యమ గేయాన్ని సోమేశ్వరరావు ఆలపించారు. జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పి రాజుబాబు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ రావు, యమ్ వెంకటరమణ, అర్జున్, వేణు గోపాల్, జేవివి నాయకులు కార్యకర్తలు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అందరికీ స్వీట్ పంపిణీ చేశారు.

## ఘనంగా యూటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు

విశాలాంధ్ర-ప్రత్తిపాడు :కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ప్రాంగణంలో యుటిఎఫ్ 50వ స్వర్ణోత్సవ సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. యుటిఎఫ్ మండల ప్రెసిడెంట్ కోడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అలాగే రిటైర్డ్ ఉపాధ్యాయులు చెరుకూరి చిన్న సత్యనారాయణ, జంధ్యాల అప్పలరాజు ముఖ్య అతిథులుగా హాజరై యుటిఎఫ్ పథకావిష్కరణ నిర్వహించారు. పలువురు యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై గత 50 సంవత్సరాలుగా ఉద్యమాలు, వాటి ఫలితాలుపై వివరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వివి రమణ, యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ డైరెక్టర్ ఆర్ రామలింగేశ్వర రావు, మండల కార్యదర్శి డి రాజబాబు, ఎంవి రమణ, సిహెచ్ గణేష్, వి రవితేజ, ఎం స్వామి కుమార్, సిహెచ్ అప్పారావు, సిహెచ్‌వి సూర్యావతి, కృష్ణవేణి తదితర పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహంపై దాడి రాజ్యాంగ విరుద్ధం

విశాలాంధ్ర - భీమవరం టౌన్: విజయవాడలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్ర హాన్ని ధ్వంసం చేయటం రాజ్యాంగ విరుద్ధ మని, అటువంటి వారిని ఉపేక్షించకూడదని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు అన్నారు. శనివారం గునుపూడిలోని తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, అపర మేధావి, దళిత ఆశ జ్యోతి, దేశానికే ఒక దిక్సూచి అయిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, శృతి వనం దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుందన్నారు. అటువంటి శృతి వనంలో అల్లరి మూకలు ప్రవేశించి, విగ్రహాన్ని పాడు చేయటం ఉపేక్షించ దగ్గ విషయం కాదని, దీనిపై వెంటనే సీఎం చంద్ర బాబు నాయుడు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. దేశ నాయకుల విగ్ర హాలపై దాడి చేసే వారిని అరికట్టాలన్నారు.